

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 276 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 06, సెప్టెంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# అంతర్మతం పేరుతో..

# ఆర్ఎస్ఎస్ ఎత్తుగడ?






మత పెద్దలను తప్పుదోవ పట్టించి భగవత్ వేదికపైకి తెచ్చారా?

న్యూయార్క్ కార్యక్రమంపై అమెరికన్ మత నాయకుల అభ్యంతరాలు

ఆర్ఎస్ఎస్ పాత్రను ముందుగా వెల్లడించలేదని ఆరోపణలు

అంతర్మత సామరస్యం పేరుతో ప్రచార ప్రయోజనాలా?

కార్యక్రమం పారదర్శకతపై తీవ్ర ప్రశ్నలు

డాక్టర్ బరిగెల శివ

అంతర్మత సామరస్యం పేరుతో నిర్వహించిన కార్యక్రమం ఇప్పుడు వివాదానికి కేంద్రంగా మారింది. “వన్ వరల్డ్, వన్ హ్యూమానిటీ” వేదిక వెనుక ఆర్ఎస్ఎస్ ప్రచార వ్యూహం ఉందా అనే ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. మోహన్ భగవత్ ప్రధాన వ్యక్తిగా పాల్గొంటున్న విషయం తమకు ముందుగా తెలియలేదని ఇద్దరు అమెరికన్ మత నాయకులు ప్రకటించడం కలకలం రేపుతోంది. అసలు విషయం ముందే తెలిసి ఉంటే తాము కార్యక్రమానికి హాజరయ్యేవాళ్లం కాదని వారు స్పష్టం చేయడం నిర్వాహకుల పారదర్శకతపై అనుమానాలను పెంచింది. అంతర్మత సమావేశంగా ఆహ్వానించి.. ఆర్ఎస్ఎస్ అధినేతతో ఒకే వేదికపైకి తీసుకురావడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మత నాయకుల హాజరును అంతర్జాతీయ స్థాయిలో ఆర్ఎస్ఎస్‌కు అంగీకారం ఉన్నట్లు చూపించేందుకు ఉపయోగించారా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్యక్రమ వివరాల్లో భగవత్ పేరును ముందుగా స్పష్టంగా పేర్కొనలేదన్న ఆరోపణలు మరింత అనుమానాలకు తావిస్తున్నాయి. తాము ఇచ్చిన అభిప్రాయాలు, కట్టుబాట్లను తరువాత ఆర్ఎస్ఎస్ ప్రచారానికి ఉపయోగించారా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. మానవత్వం, మత సామరస్యం పేరుతో జరిగే వేదికల్లో పూర్తి సమాచారం, పారదర్శకత తప్పనిసరి అని విమర్శకులు అంటున్నారు. ఇద్దరు ప్రముఖ మత నాయకుల బహిరంగ ప్రకటనల నేపథ్యంలో ఈ కార్యక్రమం అసలు ఉద్దేశంపై నిర్వాహకులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు.

- హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

3



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్




# మురిగిన గుడ్లు..
## పురుగుల కూరగాయలా?

విద్యార్థుల ఆరోగ్యంపై చెలగాటమా..?

నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారనే ఆరోపణలు

పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతపై తల్లిదండ్రుల ఆందోళన

విద్యార్థులతో పాఠశాల పనులు చేయిస్తున్నారనే విమర్శలు

కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్



2

# నకిరేకల్‌లో అభివృద్ధి జోరు

100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రారంభం

రూ.340 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నల్లగొండ కాంగ్రెస్ ఖిల్లా.. నకిరేకల్ కాంగ్రెస్ అడ్డా: సీఎం

బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు

రైతులు, మహిళలు, యువత సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**నకిరేకల్ (జై భీమ్ న్యూస్):**

నకిరేకల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం సుమారు రూ. 340 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాను కాంగ్రెస్‌కు కంచుకోటగా అభివర్ణిస్తూ బీఆర్ఎస్ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. “నల్లగొండ కాంగ్రెస్ ఖిల్లా.. నకిరేకల్ కాంగ్రెస్ అడ్డా”: భారీగా తరలి వచ్చిన ప్రజలను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, “నల్లగొండ జిల్లా కాంగ్రెస్ ఖిల్లా.. నకిరేకల్ గడ్డ కాంగ్రెస్ అడ్డా” అని అన్నారు. నకిరేకల్‌లో కనిపిస్తున్న జనసంద్రాన్ని చూస్తే కృష్ణా, గోదావరి నదులు ఉప్పొంగినట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇందిరమ్మ పాలన కొనసాగడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గత పాలనతో ప్రస్తుత

- మిగతా 2లో..




Smt M Satya Sarada Devi,
Magistrate & District Collector,
Warangal.

1. The Commissioner, GWMC, Warangal District.
2. The Commissioner of police, Warangal.
3. The Revenue Divisional Officer, Warangal.
4. The Sub- Registrar, Fort Warangal.
5. The Thasildar, Fort Warangal Mandal.
6. The Station House Officer, Mills Colony Ps.

Respected Madam/Sir,

Sub:- Waqf – Warangal District – Fort Warangal Mandal – Urs Jagir Village Dargah Zinda Bikkan Darvesh, and Masjid, back side Tallapadmavathi college in respect of Sy. No.273, 274, 275, & 276, to an extent Ac.17-05 Gts – request to stop Illegal encroachments and protect Waqf property – Regarding.

Ref:- 1. O.S.No.85/2005, at Additional Senior Civil Judge at Warangal.
2. Letter from District Collector, Warangal, to the Sub-Register, Warangal, in F.No.47/Waqf/Wgl/2000, Dt:-31-03-2011 & 22-01-19.
3. Letter from the District Collector, Warangal to the Sub-Registrar, Fort Warangal, In F.No.135/Prot/Waqf/Wgl/2012, 15-11-2012, 10-04-13.
4. Letter from the Inspector Auditor Waqf, Warangal to the Station House Officer, Mills Colony Ps, Fort Warangal, Dated: 23-12-2014, 10-12-2018, 17-11-2021, 07-09-2022, 01-02-2025, 24-04-2025 and 10-02-2026.
5. Letter from the District Collector to the Commissioner, GWMC, Warangal, in F.No.47/Waqf/Wgl/2000, Dated:-23-09-2021.
6. Letter from the District Revenue Officer, Warangal, to the sub Registrar, Fort Warangal, in F.No.47/Waqf/Wgl/2000, Dated:-24-09-2024.
7. Representation from Mohd. Mahammed Ali Grievance Cell.No. WGRDC/E/2026/01183, Dated:-13-04-2026.

The Waqf Institution in Dargah Hzt. Zinda Bikkan Darvesh, and Masjid near Dargah, fort Warangal is a registered and notified Waqf property published in AP. Gazette No.5-A, Dated:- 01-02-1990 to an extent 600 Sq. Yard and attached property in Sy. No.273, 274, 275 & 276, an extent Ac.8.05 Gts an got Addendum notification for

## 17 ఎకరాల 05 గుంటల వక్ఫ్ భూమిపై అక్రమ కబ్జాలకు అడ్డుకట్ట.. రంగంలోకి కలెక్టర్

అక్రమ నిర్మాణాలు నిలిపివేయండి..

భూమిని గుర్తించి ప్రహరీతో పరిరక్షించండి

మున్సిపల్, పోలీసు, రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు

3



# అధికార పార్టీలో ఉంటూ..
# సొంత పార్టీకే వెన్నుపోటా!?

అధికార పార్టీలో పదవి అనుభవిస్తూ పార్టీని బలహీనపరుస్తున్నారనే ఆరోపణలు

పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారనే విమర్శలు

ఎమ్మెల్యే నాయకత్వాన్ని బలహీనపరిచే ప్రయత్నాలపై కార్యకర్తల ఆవేదన

ఎన్నికల సమయంలో సొంత పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేశారనే ఆరోపణలు

ఆరోపణలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి: మాజీ ఎంపీటీసీ బొల్లెపెల్లి మధు

2

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన, పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై అభివృద్ధి శ్వేతపత్రం విడుదల చేయాలి

**ప్రజల పన్నులతో బడ్జెట్‌లు.. బహుజనులకు దక్కిందేమిటి?**
**బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ డిమాండ్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 5, 2026:**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు చెల్లించే పన్నులు, వారి కష్టార్జితంతోనే ప్రభుత్వ బడ్జెట్‌లు రూపొందుతున్నాయని, దశాబ్దాలుగా లక్షల కోట్ల రూపాయలు కేటాయించి ఖర్చు చేస్తున్నప్పటికీ పేదరికం, నిరుద్యోగం, సామాజిక అసమానతలు ఎందుకు తగ్గడం లేదో ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ డిమాండ్ చేశారు. తెలంగాణలో సుమారు 90 శాతం జనాభా కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బహుజన వర్గాలకు ప్రభుత్వ బడ్జెట్‌ల ద్వారా వాస్తవంగా ఎంత ప్రయోజనం చేకూరిందో ప్రభుత్వం శ్వేతపత్రం ద్వారా వెల్లడించాలని ఆయన కోరారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి ఏమిటి? అలాగే వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అందిన ప్రయోజనాలు ఏమిటి? అనే అంశాలపై సమగ్ర వివరాలతో ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వసతుల లేమి, దళితుల భూముల ఆక్రమణలు, 22–ఏ పేరుతో కొనసాగుతున్న భూ సమస్యలు, మూసీ సుందరీకరణ కారణంగా పేదలపై పడుతున్న ప్రభావం, రింగ్ రోడ్లు–ఆర్‌ఆర్‌ఆర్ పేరుతో భూముల ధరల పెరుగుదల, అట్రాసిటీ చట్టం అమలులో లోపాలు వంటి సమస్యలకు ఇప్పటికీ శాశ్వత పరిష్కారం ఎందుకు లభించడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఉద్యోగాల హామీలు ఎంతవరకు అమలయ్యాయో కూడా ప్రజలకు పూర్తి లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు.

**బీఎస్పీ ప్రధాన డిమాండ్**

గత దశాబ్దాలుగా తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన మొత్తం బడ్జెట్ ఎంత? ప్రతి శాఖకు ఎంత కేటాయించారు? వాస్తవంగా ఎంత ఖర్చు చేశారు? ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కోసం ఎంత నిధులు కేటాయించారు? ఆ నిధుల ద్వారా విద్య, ఉద్యోగాలు, వైద్యం, భూములు, సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి రంగాల్లో జరిగిన వాస్తవ ప్రయోజనం ఎంత? అనే అంశాలపై పూర్తి వివరాలను ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలని ఇబ్రాం శేఖర్ డిమాండ్ చేశారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనతో పాటు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, కేటాయింపులు, ఖర్చులు, ప్రజలకు అందిన ఫలితాలపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలి అని ఆయన స్పష్టం చేశారు. "ప్రజల సొమ్ముకు ప్రజలకు లెక్క చెప్పాలి. బడ్జెట్‌ల పరిమాణం పెరగడం కాదు... బహుజనుల జీవన ప్రమాణాలు పెరగాలి. సంక్షేమం పేరుతో ప్రజలను ఎప్పటికీ ఆధారపడేలా చేయడం కాదు... విద్య, ఉద్యోగం, ఆర్థిక స్వావలంబన, రాజకీయ అధికారం కల్పించాలి" అని అన్నారు. ప్రజల పన్నులతో వచ్చిన ప్రతి రూపాయికి ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలని, పూర్తి లెక్కలు చెప్పే వరకు బీఎస్పీ ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుందని ఇబ్రాం శేఖర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జోన్–1 ఇంచార్జ్ దాగిల్ల దయానంద్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బోడపట్ల ఈశ్వర్, గుండెల ధర్మేందర్, బండి పృథ్వీరాజ్, బానోత్ రవీందర్ నాయక్, కోశాధికారి ప్రణయ్ కుమార్, హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్––మల్కాజ్‌గిరి జిల్లాల అధ్యక్షులు అలగొల రమేష్, సొంటె శ్రీనివాస్, విజయరాజ్, సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్ ఇంచార్జీలు రాందాస్, దోసల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల భూ సమస్యల పరిష్కారానికి రీ-సర్వే ఎంతో ఉపయోగకరం

**రాయపర్తి(జై భీమ్ న్యూస్)**



రాయపర్తి మండలం,రైతులు ఎదుర్కొంటున్న భూ సరిహద్దులు, విస్తీర్ణం, రికార్డులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న రీ–సర్వే కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వరంగల్ ఆర్డీవో సుమ తెలిపారు. రాయపర్తి మండలం కొండాపురం గ్రామంలో కొనసాగుతున్న రీ–సర్వే కార్యక్రమాన్ని రాయపర్తి తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి వరంగల్ ఆర్డీవో సుమ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే పనుల పురోగతిని పరిశీలించి, క్షేత్రస్థాయిలో చేపడుతున్న ప్రక్రియపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం రైతులతో మాట్లాడిన ఆర్డీవో సుమ, రీ–సర్వే ప్రక్రియ ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. భూముల సరిహద్దుల విషయంలో ఏర్పడుతున్న వివాదాలు, విస్తీర్ణంలో ఉన్న తేడాలు, భూ రికార్డుల్లో చోటుచేసుకున్న లోపాలు వంటి సమస్యల పరిష్కారానికి రీ–సర్వే కీలకంగా మారుతుందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి చేపడుతున్న ఈ రీ–సర్వే ద్వారా ప్రతి భూమికి సంబంధించిన వివరాలు మరింత స్పష్టంగా నమోదు చేయబడతాయని పేర్కొన్నారు. భూముల హద్దులు, విస్తీర్ణం తదితర అంశాలపై స్పష్టత రావడంతో భవిష్యత్తులో రైతులు అనేక ఇబ్బందుల నుంచి బయటపడే అవకాశం ఉంటుందని వివరించారు. రీ–సర్వే కార్యక్రమం విజయవంతంగా, పారదర్శకంగా పూర్తయ్యేందుకు రైతులందరూ అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. సర్వే సమయంలో రైతులు తమకు సంబంధించిన భూ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని, భూముల వివరాలను సక్రమంగా అధికారులకు తెలియజేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సర్వేయర్లు చేపడుతున్న సర్వే ప్రక్రియలో రైతులు అప్రమత్తంగా పాల్గొని, తమ భూముల హద్దులు మరియు ఇతర వివరాలపై సరైన సమాచారాన్ని అందించాలని తెలిపారు.



ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మురిగిన గుడ్లు.. పురుగుల కూరగాయలా?

**విద్యార్థుల ఆరోగ్యంపై చెలగాటమా..?**
**నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారనే ఆరోపణలు**
**పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతపై తల్లిదండ్రుల ఆందోళన**
**విద్యార్థులతో పాఠశాల పనులు చేయిస్తున్నారనే విమర్శలు**
**కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్**

**ఐనవోలు (జై భీమ్ న్యూస్):**

మురిగిపోయిన గుడ్లు, నాణ్యత లేని కూరగాయలతో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నారని ఐనవోలు మండలం రెడ్డిపాలెంలోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలపై తల్లిదండ్రులు, స్థానికుల నుంచి పలు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు అందిస్తున్న ఆహారంలో మురిగిపోయిన గుడ్లు, నాణ్యత లేని కూరగాయలు వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. పిల్లలకు పోషకాహారం అందించాల్సిన పాఠశాలలో ఆహార నాణ్యతపై అనుమానాలు వ్యక్తం కావడం పట్ల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల కడుపులోకి వెళ్లే ప్రతి ఆహార పదార్థం నాణ్యమైనదేనా, ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు ఎవరు తనిఖీ చేస్తున్నారు, వాటి నాణ్యతను ఎలా నిర్ధారిస్తున్నారు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మురిగిపోయిన గుడ్లు విద్యార్థులకు అందిస్తున్నారనే ఆరోపణల్లో వాస్తవమెంత అనేది సంబంధిత అధికారులు విచారణ ద్వారా తేల్చాల్సిన అవసరం ఉంది. ఇదే సమయంలో పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, విద్యార్థుల చదువుపై దాని ప్రభావం పడుతోందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రతి సబ్జెక్టుకు తగినంత మంది ఉపాధ్యాయులు ఉన్నారా, ఉపాధ్యాయుల కొరత ఉంటే విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా విద్యార్థులతో పాఠశాలకు సంబంధించిన పలు పనులు చేయిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. విద్యార్థుల ప్రధాన బాధ్యత చదువుకోవడమే తప్ప పాఠశాల పనులు చేయడం కాదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. చిన్నారుల ఆరోగ్యం, భద్రత, విద్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సంబంధిత విద్యాశాఖ అధికారులు పాఠశాలను తక్షణమే తనిఖీ చేసి ఆహార పదార్థాల నాణ్యత, వంటశాల పరిశుభ్రత, ఆహార నిల్వలు, ఉపాధ్యాయుల అందుబాటు, విద్యార్థులతో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో వాస్తవం ఉంటే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు అవాస్తవమైతే పాఠశాల యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. పిల్లల ఆరోగ్యంతో రాజీ పడకుండా, వారి చదువుతో చెలగాటం ఆడకుండా అధికారులు వాస్తవాలను వెలికి తీసి అవసరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో నిజమెంత..? పాఠశాల యాజమాన్యం సమాధానం ఏమిటి..? అధికారులు ఎప్పుడు స్పందిస్తారు..? అనే ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది.



# అధికార పార్టీలో ఉంటూ.. సొంత పార్టీకే వెన్నుపోటా!?

**అధికార పార్టీలో పదవి అనుభవిస్తూ పార్టీని బలహీనపరుస్తున్నారనే ఆరోపణలు**
**పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారనే విమర్శలు**
**ఎమ్మెల్యే నాయకత్వాన్ని బలహీనపరిచే ప్రయత్నాలపై కార్యకర్తల ఆవేదన**
**ఎన్నికల సమయంలో సొంత పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేశారనే ఆరోపణలు**
**ఆరోపణలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి: మాజీ ఎంపీటీసీ బొల్లెపెల్లి మధు**



**ఐనవోలు, (జై భీమ్ న్యూస్):**

అధికార పార్టీలో పదవి అనుభవిస్తూ.. అదే పార్టీని క్షేత్రస్థాయిలో బలహీనపరిచేలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు అయినవోలు మండల రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. పార్టీలో కొనసాగుతూనే పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ, ప్రత్యర్థి రాజకీయ శక్తులకు పరోక్షంగా సహకరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే పాల్గొంటున్నప్పటికీ, అధికార పార్టీలోనే ఉన్న కొందరు నాయకులు కావాలనే ఆ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీ కార్యక్రమాల కంటే వ్యక్తిగత ఆధిపత్యానికే ప్రాధాన్యత ఇస్తూ, ఎమ్మెల్యే నాయకత్వాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు పార్టీ కార్యకర్తల నుంచి వస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యేను ఉద్దేశించి అహంకారపూరితంగా మాట్లాడుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. "నేను లేకుండా ఎమ్మెల్యే ఎవరు?" అన్నట్లుగా వ్యవహరిస్తూ పార్టీ శ్రేణుల్లో విభేదాలు సృష్టిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పార్టీ నాయకత్వాన్ని గౌరవించకుండా, వ్యక్తిగత ఇమేజ్ కోసం రాజకీయాలు చేయడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీకి నష్టం జరుగుతోందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కూడా సొంత పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేసి, అనుచరులను ఇతర పార్టీల అభ్యర్థులకు అనుకూలంగా పంపించారనే ఆరోపణలు ఇప్పుడు రాజకీయంగా కలకలం రేపుతున్నాయి. పార్టీ గుర్తుపై గెలిచిన వార్డు సభ్యులపై ఒత్తిడి తెచ్చి ప్రత్యర్థి పార్టీకి చెందిన సర్పంచ్‌కు మద్దతు ఇవ్వాలని ప్రయత్నించారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. పార్టీలో ఉంటూ ఎన్నికల సమయంలో సొంత పార్టీ అభ్యర్థులకే వెన్నుపోటు పొడిచారనే ఆరోపణలు ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వం చేపట్టిన వెయ్యి రోజుల పాలన కార్యక్రమానికి కూడా దూరంగా ఉండటం పట్ల పార్టీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఒకవైపు ప్రభుత్వ, ఎమ్మెల్యే కార్యక్రమాలకు దూరంగా ఉంటూ, మరోవైపు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ప్రత్యేక గ్రూపును తయారు చేసి పార్టీని అంతర్గతంగా బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీలో కొనసాగుతూనే బీఆర్ఎస్‌కు సంబంధించిన కార్యక్రమాలకు పరోక్షంగా ప్రోత్సాహం అందిస్తున్నారనే ఆరోపణలు కూడా రాజకీయ వేడిని పెంచుతున్నాయి. సొంత పార్టీ జెండా మోస్తూ ప్రత్యర్థి పార్టీ కార్యక్రమాలకు అండగా నిలవడం వెనుక అసలు ఉద్దేశమేంటని పార్టీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత ఉన్న నాయకులే అంతర్గత విభేదాలను పెంచితే నిజమైన కార్యకర్తలు నష్టపోతారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు వెలికితీయాలని మాజీ ఎంపీటీసీ బొల్లెపెల్లి మధు డిమాండ్ చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు నిజమని తేలితే, పార్టీలో ఎంతటి పదవిలో ఉన్న వారైనా కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సస్పెన్షన్‌కు కూడా వెనుకాడకూడదని ఆయన కోరారు. "పార్టీలో పదవి అనుభవిస్తూ పార్టీకి నష్టం చేసే వారిని ఉపేక్షిస్తే నిజమైన కార్యకర్తలకు అన్యాయం చేసినట్టే. సొంత పార్టీని బలహీనపరుస్తూ, ప్రత్యర్థులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలపై పీసీసీ అధ్యక్షుడు వెంటనే విచారణ జరిపించి, నిజాలు బయటపెట్టి కఠిన చర్యలు తీసుకోవాలి" అని మాజీ ఎంపీటీసీ బొల్లెపెల్లి మధు డిమాండ్ చేశారు.

# సంఘ్ పరివార్‌కు చెందిన స్వతంత్ర భరద్వాజ్ అరెస్ట్

**సిజెపి ఆందోళనలతో దిగొచ్చిన ఢిల్లీ పోలీసులు**
**హత్యాయత్నం కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద సెక్షన్లు నమోదు**

**ఢిల్లీ (జై భీమ్ న్యూస్)**



జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళన సందర్భంగా సిజెపి కార్యకర్త నిషు ఆజాద్ తండ్రి సంజయ్‌కుమార్‌పై జరిగిన దాడి కేసులో సంఘ్ పరివార్‌కు చెందిన స్వతంత్ర భరద్వాజ్‌ను ఢిల్లీ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. ఘటన జరిగినప్పటి నుంచి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఆలస్యం జరిగిందనే ఆరోపణల మధ్య, సిజెపి నాయకులు, కార్యకర్తలు పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగడంతో పోలీసులు చర్యలు చేపట్టినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో స్వతంత్ర భరద్వాజ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు శుక్రవారం వెల్లడించారు. ఆయనపై హత్యాయత్నం కేసు నమోదు చేయడంతో పాటు, దాడికి గురైన సంజయ్‌కుమార్ ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కూడా సంబంధిత సెక్షన్లు చేర్చనున్నట్లు పోలీసులు తెలిపినట్లు సమాచారం. జూలైలో జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల ఆందోళన సమయంలో సంజయ్‌కుమార్‌పై స్వతంత్ర భరద్వాజ్ దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో బాధితుడు తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. అనంతరం ఈ దాడి గురించి స్వతంత్ర భరద్వాజ్ మాట్లాడినట్లు ప్రచారంలోకి వచ్చిన ఒక ఇంటర్వ్యూ వీడియో ఇటీవల వైరల్ కావడంతో ఈ వ్యవహారం మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. ఆ వీడియోలో దాడి ఘటనకు సంబంధించిన అంశాలను బహిరంగంగా ప్రస్తావించడమే కాకుండా, తనపై చర్యలు తీసుకోలేరనే ధోరణిలో వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి.



# నకిరేకల్‌లో అభివృద్ధి జోరు






మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును పోల్చి చూడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనకు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు మధ్య తేడాను ప్రజలే నిర్ణయించాలని అన్నారు. బీఆర్ఎస్‌పై ఘాటు విమర్శలు: ప్రస్తుత ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులకు సీఎం సూటి ప్రశ్నలు సంధించారు. వారి హయాంలో అమలు చేసిన ఏ ఒక్క పథకాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయలేదని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ విషయంలో ప్రతిపక్షం చేస్తున్న విమర్శలకు సమాధానం చెప్పేందుకు సిద్దిపేట, సిరిసిల్ల లేదా అసెంబ్లీలో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. "మీరు రైతులకు ఎంత ఖర్చు చేశారు..? మేం ఎంత చేశాం..? లెక్కలతో చర్చకు రండి" అంటూ బీఆర్ఎస్ నాయకులను నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు రుణమాఫీ కోసం రూ.30 వేల కోట్ల వరకు ఖర్చు చేసి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని పేర్కొన్నారు. గత 30 నెలల్లో రైతుల సంక్షేమం కోసం రూ.1.70 లక్షల కోట్ల మేర ఖర్చు చేశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని గత పాలకులు తమ సొంత ఆస్తిలా భావించి దోచుకున్నారని ఆరోపిస్తూ, "తెలంగాణను బందిపోట్ల ముఠా లెక్క దోచుకున్నారు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహిళల కోసం పథకాలు.. ఉపాధి అవకాశాలు: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని, ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే వేల కోట్ల రూపాయలు ఆర్టీసీకి చెల్లించిందని సీఎం తెలిపారు. మహిళలు ఉచిత ప్రయాణంతో ప్రతి నెలా గణనీయమైన మొత్తాన్ని ఆదా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు కేవలం సంక్షేమ పథకాలే కాకుండా ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్టీసీ బస్సుల నిర్వహణ, పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ రంగాల్లో మహిళా సంఘాలకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. హైటెక్ సిటీ శిల్పారామం సమీపంలో విలువైన భూమిని మహిళల ఉపాధి కోసం కేటాయించామని పేర్కొన్నారు. మహిళలకు సున్నా వడ్డీ రుణాలు అందిస్తున్నామని, వారి ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని రద్దు చేయబోమని స్పష్టం చేశారు. యువతకు ఉద్యోగాలు.. బడుగు వర్గాలకు పదవులు: యువత కోసం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేశామని సీఎం తెలిపారు. గత పాలనలో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడారని విమర్శించారు. "కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే కుటుంబ సభ్యులకు పదవులు వచ్చాయి.. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే పేద, బీద, బడుగు వర్గాల వారికి పదవులు దక్కుతున్నాయి" అంటూ ఆయన రాజకీయంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పిస్తున్నామని చెబుతూ శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, సీపీఐ సత్యం వంటి వారికి ఎమ్మెల్సీ పదవులు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం: రాష్ట్రంలో కోట్లాది మంది ప్రజలకు సన్న బియ్యం అందిస్తున్నామని సీఎం తెలిపారు. 1 కోటి 6 లక్షల రేషన్ కార్డుల ద్వారా 3 కోట్ల 48 లక్షల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. నకిరేకల్‌లో 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రారంభం, రూ.340 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనతో నియోజకవర్గ అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మరోవైపు, సభా వేదికగా బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన తీవ్ర విమర్శలు నకిరేకల్ రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించాయి.




# 17 ఎకరాల 05 గుంటల వక్ఫ్ భూమిపై అక్రమ కబ్జాలకు అడ్డుకట్ట.. రంగంలోకి కలెక్టర్

**అక్రమ నిర్మాణాలు నిలిపివేయండి..**
**భూమిని గుర్తించి ప్రహరీతో పరిరక్షించండి**
**మున్సిపల్, పోలీసు, రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు**

**హైదరాబాద్(జై భీమ్ డెస్క్)**

ఫోర్ట్ వరంగల్ మండలం ఉర్సు జాగీర్ గ్రామంలోని విలువైన వక్ఫ్ భూముల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం కదిలింది. దర్గా హజ్రత్ జిందా బిక్కన్ దర్వేష్ మరియు మసీదుకు చెందిన వక్ఫ్ ఆస్తులపై అక్రమ ఆక్రమణలు, నిర్మాణాలను అడ్డుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ ఎం. సత్య శారదా దేవి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఉర్సు జాగీర్ గ్రామంలో తాళ్ల పద్మావతి కళాశాల వెనుక భాగంలో ఉన్న సర్వే నెంబర్లు 273, 274, 275, 276లకు సంబంధించిన మొత్తం 17 ఎకరాల 05 గుంటల భూమి వక్ఫ్ ఆస్తి అని కలెక్టర్ కార్యాలయం నుంచి జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ భూమి దర్గా హజ్రత్ జిందా బిక్కన్ దర్వేష్ మరియు మసీదుకు చెందినదిగా అధికారికంగా నమోదైందని స్పష్టం చేశారు.

**గెజిట్‌లోనే వక్ఫ్ ఆస్తిగా నమోదు**

ఈ భూమి ఏపీ గెజిట్ నెం. 5-ఏ, తేదీ 01-02-1990లో వక్ఫ్ ఆస్తిగా నోటిఫై చేయబడినట్లు ఉత్తర్వుల్లో వివరించారు. సంబంధిత సర్వే నెంబర్లలోని భూమి వక్ఫ్ ఆస్తి పరిధిలోకి వస్తుందని అధికారిక రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. వక్ఫ్ భూమి రక్షణకు సంబంధించి గతంలో కూడా జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సబ్ రిజిస్ట్రార్, రెవెన్యూ, పోలీసు శాఖలకు పలుమార్లు లేఖలు పంపినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వక్ఫ్ అధికారుల నివేదికలు, రెవెన్యూ రికార్డులు, గత ఉత్తర్వులు తదితర అంశాలను పరిశీలించిన అనంతరం తాజా ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

**కోర్టు తీర్పు కూడా వక్ఫ్ బోర్డుకే అనుకూలం**

ఈ భూమిపై కొందరు ప్రైవేట్ వ్యక్తులు యాజమాన్య హక్కులు కోరుతూ కోర్టును ఆశ్రయించగా, ఓఎస్ నెం. 85/2005లో వారి యాజమాన్య వాదనలను కోర్టు తిరస్కరించినట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో సంబంధిత భూమిపై వక్ఫ్ బోర్డు హక్కులకు న్యాయపరమైన బలం లభించినట్లు స్పష్టమవుతోంది. గెజిట్ నోటిఫికేషన్, అధికారిక రికార్డులు, కోర్టు తీర్పులు ఉన్నప్పటికీ వక్ఫ్ భూముల పరిరక్షణపై ఇంకా ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి రావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. విలువైన వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత సంబంధిత శాఖలపై ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**అక్రమ ఆక్రమణలు, నిర్మాణాలపై నిఘా**



వక్ఫ్ భూమిలో ఎలాంటి అక్రమ ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అనుమతులు లేకుండా చేపట్టే నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూమిని క్షేత్రస్థాయిలో గుర్తించి, దాని హద్దులను నిర్ధారించి, అవసరమైన చోట ప్రహరీ ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో పరిరక్షించాలని సూచించారు. ఈ మేరకు 47/వక్ఫ్/వరంగల్/2000, తేదీ 04-05-2026 ప్రకారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, వరంగల్ పోలీస్ కమిషనర్, జిల్లా రెవెన్యూ అధికారి, ఫోర్ట్ వరంగల్ సబ్ రిజిస్ట్రార్, ఫోర్ట్ వరంగల్ తహసీల్దార్, మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌లకు ఉత్తర్వుల ప్రతులను పంపించారు.

**అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలి**

వక్ఫ్ భూమి ఎక్కడ ఉంది? ప్రస్తుతం దాని పరిధి ఎంత? భూమిలో ఎలాంటి నిర్మాణాలు ఉన్నాయి? ఎక్కడైనా అక్రమ ఆక్రమణలు జరిగాయా? జరిగితే వాటిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. 17 ఎకరాల 05 గుంటల విలువైన వక్ఫ్ భూమిని పరిరక్షించాలన్న కలెక్టర్ తాజా ఆదేశాలు ఇప్పుడు కీలకంగా మారాయి. గతంలో జారీ అయిన లేఖలు, ఉత్తర్వులు కేవలం కార్యాలయ ఫైళ్లకే పరిమితం కాకుండా, ఈసారి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వక్ఫ్ భూమిని పూర్తిస్థాయిలో గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికంగా డిమాండ్ వ్యక్తమవుతోంది. అక్రమ కబ్జాలు, అనధికార నిర్మాణాలకు తావు లేకుండా కఠిన చర్యలు తీసుకుని, వక్ఫ్ ఆస్తిని భవిష్యత్తు తరాలకు సైతం పరిరక్షించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు ఎంత వేగంగా స్పందిస్తారు? వక్ఫ్ భూమికి శాశ్వత రక్షణ ఎప్పుడు కల్పిస్తారు? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



Office of the Collectorate,
Warangal District.

F.No.47/Waqf/Wgl/2000
From,
Smt M Satya Sarada Devi,
Magistrate & District Collector,
Warangal.

Dated:-04-05-2026

To.
1. The Commissioner, GWMC, Warangal District.
2. The Commissioner of police, Warangal.
3. The Revenue Divisional Officer, Warangal.
4. The Sub- Registrar, Fort Warangal.
5. The Thasildar, Fort Warangal Mandal.
6. The Station House Officer, Mills Colony Ps.

Respected Madam/Sir,

Sub:- Waqf – Warangal District – Fort Warangal Mandal – Urs Jagir Village Dargah Zinda Bikkan Darvesh, and Masjid, back side Tallapadmavathi college in respect of Sy. No.273, 274, 275, & 276, to an extent Ac.17-05 Gts – request to stop Illegal encroachments and protect Waqf property – Regarding.

Ref:-
1. O.S.No.85/2005, at Additional Senior Civil Judge at Warangal.
2. Letter from District Collector, Warangal, to the Sub-Register, Warangal,in F.No.47/Waqf/Wgl/2000, Dt:-31-03-2011 & 22-01-19.
3. Letter from the District Collector, Warangal to the Sub-Registrar, Fort Warangal, In F.No.135/Prot/Waqf/Wgl/2012, 15-11-2012, 10-04-13.
4. Letter from the Inspector Auditor Waqf, Warangal to the Station House Officer, Mills Colony Ps, Fort Warangal, Dated: 23-12-2014, 10-12-2018, 17-11-2021, 07-09-2022, 01-02-2025, 24-04-2025 and 10-02-2026.
5. Letter from the District Collector to the Commissioner, GWMC, Warangal, in F.No.47/Waqf/Wgl/2000, Dated:-23-09-2021.
6. Letter from the District Revenue Officer, Warangal, to the sub Registrar, Fort Warangal, in F.No.47/Waqf/Wgl/2000, Dated:-24-09-2024.
7. Representation from Mohd. Mahammed Ali Grievance Cell.No. WGRDC/E/2026/01183, Dated:-13-04-2026.

******

The Waqf Institution in Dargah Hzt. Zinda Bikkan Darvesh, and Masjid near Dargah, fort Warangal is a registered and notified Waqf property published in AP. Gazette No.5-A, Dated:- 01-02-1990 to an extent 600 Sq. Yard and attached property in Sy. No.273, 274, 275 & 276, an extent Ac.8.05 Gts an got Addendum notification for correction of record to Waqf Property to an total Extent Ac.17.05 Gts situated at Urs Village, Fort Warangal Mandal, Warangal District.

Through Reference 1st cited, the Hon'ble Civil Court has dismissed the ownership claims of private individuals (Bathini Anandam, Bathini Agamma, and others) in O.S. No. 85/2003. Hence judgment in favour of Waqf Board.

## కాంగ్రెస్ పాలనలో భూముల కష్టాలు..

హైదరాబాద్ : మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రజలకు అందిన భూముల విషయంలో ప్రస్తుతం ఇబ్బందులు ఎదురవుతున్నాయని హరీష్ రావు ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో మంచిర్యాల జిల్లాలో ప్రజలకు పట్టాలు అందించేందుకు జీవో 76ను తీసుకువచ్చామని హరీష్ రావు తెలిపారు. ఈ జీవో ద్వారా అర్హులైన పలువురు ప్రజలకు భూములకు సంబంధించిన పట్టాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలకు సౌకర్యం కల్పించడం, భూములపై వారికి హక్కులు కల్పించడమే లక్ష్యంగా అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయన అన్నారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీవో 22ఏను తీసుకువచ్చి గతంలో పంపిణీ చేసిన పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చిందని హరీష్ రావు ఆరోపించారు. దీనివల్ల పట్టాలు ఉన్నప్పటికీ ఆయా భూములకు సంబంధించిన లావాదేవీలు, ఇతర వ్యవహారాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. తమ భూముల విషయంలో స్పష్టత లేకపోవడంతో పలువురు ప్రజలు ఆందోళన చెందుతున్నారని హరీష్ రావు తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఈ సమస్యను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

# ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వెంటనే మాదిగలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

**బాధితుల కోసం పోరాడిన ఎమ్మార్పీఎస్ నాయకత్వాన్ని అవమానించడం బాధాకరం**
**ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జ్ దుడ్డు రామకృష్ణ మాదిగ డిమాండ్**






**పల్నాడు జిల్లా(జై భీమ్ న్యూస్)**

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని పోరాడిన ఎమ్మార్పీఎస్ నాయకత్వాన్ని కించపరుస్తూ మాట్లాడిన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని మాదిగ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జ్ దుడ్డు రామకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. స్థానిక షాదీఖానాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత నెల 26న అర్ధరాత్రి జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో వేలూరు గ్రామానికి చెందిన ఎనిమిది మంది మృతి చెందడంతో ఆయా కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయని తెలిపారు. అయితే బాధిత కుటుంబాలు కష్టాల్లో ఉన్న సమయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సరైన రీతిలో స్పందించలేదని ఆయన ఆరోపించారు. ప్రమాద బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ నాయకత్వం హైవేపై సుమారు 32 గంటల పాటు అహోరాత్రులు దిగ్బంధం చేసి పోరాటం చేసిందని రామకృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఈ పోరాటం ఫలితంగానే ప్రభుత్వం స్పందించి మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని ఆయన అన్నారు. బాధితుల కోసం రోడ్లెక్కి పోరాటం చేస్తున్న సమయంలో తమ పిలుపునకు స్పందించని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, అనంతరం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకత్వాన్ని ఉద్దేశించి "రాజకీయ నిరుద్యోగులు రోడ్లెక్కితే రూ.10 లక్షలు ఇవ్వలేదు... మేము చొరవ తీసుకున్నందుకే ఇచ్చారు" అనే రీతిలో వ్యాఖ్యానించారని ఆయన ఆరోపించారు. బాధిత కుటుంబాల పక్షాన నిలబడి న్యాయం కోసం పోరాడిన ఎమ్మార్పీఎస్ నాయకత్వాన్ని రాజకీయ నిరుద్యోగులుగా హేళన చేయడం అత్యంత అవమానకరమని, ఇది ప్రజాప్రతినిధిగా ఎంపీ వ్యవహరించిన తీరుకు నిదర్శనమని దుడ్డు రామకృష్ణ మాదిగ మండిపడ్డారు. "ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయినప్పుడు ఆ కుటుంబాలను పరామర్శించని వారు, బాధితుల కోసం పోరాడిన వారినే రాజకీయ నిరుద్యోగులంటూ అవమానించడం ఎంతవరకు సమంజసం?" అని ఆయన ప్రశ్నించారు. ప్రమాద బాధితులకు న్యాయం చేయాలంటూ పోరాటం చేసిన ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని అవమానించే వ్యాఖ్యలను మాదిగ సమాజం సహించబోదని హెచ్చరించారు. అలాగే ప్రమాద బాధితులకు ప్రకటించిన రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాతో మాత్రమే ప్రభుత్వం బాధ్యత ముగిసిపోదని స్పష్టం చేశారు. గతంలో మందకృష్ణ మాదిగ చేసిన డిమాండ్ల మేరకు ప్రతి బాధిత కుటుంబానికి 2 ఎకరాల భూమి, ఇంటి స్థలం, పిల్లలకు ఉచిత విద్య, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించే పూర్తి బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయంలో ఎమ్మార్పీఎస్ నాయకత్వంపై అవమానకర వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని మాదిగ సమాజానికి, ఎమ్మార్పీఎస్ నాయకత్వానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో-ఇన్‌ఛార్జ్‌లు అద్దంకి బాబు మాదిగ, కనుమూరి కోటేశ్వర మాదిగ, ఎంఎస్పీ జిల్లా కో-ఇన్‌ఛార్జ్ మల్లవరపు బాబు మాదిగ, సీనియర్ నాయకులు పోలిపోగు రాములు మాదిగ, చిరుగూరి నాగరాజు మాదిగ, కూచిపూడి రమేష్ మాదిగ, నరసరావుపేట మండల ఇన్‌ఛార్జ్ మొండితోక మహేంద్ర మాదిగ, ఎంఎస్ఎఫ్ టౌన్ అధ్యక్షుడు బుదాల కిరణ్ మాదిగ, సత్తెనపల్లి మండల ఇన్‌ఛార్జ్ బాబు మాదిగ, రొంపిచర్ల ఎంఎస్పీ ఇన్‌ఛార్జ్ మక్కేన పుటయ్య మాదిగతో పాటు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, మాదిగ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**ప్రభుత్వ పాలన విభాగంలో ఘనంగా టీచర్స్ డే వేడుకలు**
**విభాగాధిపతి, అధ్యాపకులకు విద్యార్థుల ఘన సన్మానం**
**క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలని సూచన**
**అంకితభావం, క్రమశిక్షణతో విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి**

**వరంగల్ (జై భీమ్ న్యూస్):**



దివి 05/09/2026 రోజున కాకతీయ విశ్వవిద్యాలయంలోని ప్రభుత్వ పాలన మరియు మానవ వనరుల నిర్వహణ విభాగంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావుతో పాటు అధ్యాపకులను విభాగం విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ విభాగం విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలని, అంకితభావంతో, క్రమశిక్షణతో విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# కలెక్టర్,ఎస్పీ అంటే పెన్నుతో ఆడించే పదవులేనా? సీఎం

డాక్టర్ బరిగెల శివ






**హైదరాబాద్(జై భీమ్ డెస్క్)**

"కలెక్టర్లను, జిల్లా ఎస్పీలను ఒక పెన్నుతో సంతకం పెట్టి ట్రాన్స్‌ఫర్ చేయొచ్చు... కానీ టీచర్లు తెలివైన వాళ్లు, వాళ్లను ట్రాన్స్‌ఫర్ చేయడం అంత ఈజీ కాదు" అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. టీచర్లను ప్రశంసించడం, వారి మేధస్సును గుర్తించడం తప్పు కాకపోయినా, అందుకోసం కలెక్టర్లు, ఎస్పీలను ఒక పెన్ను సంతకంతో ఎక్కడికైనా మార్చగలిగే వారిగా చిత్రీకరించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే సీఎం గారూ... ఐఏఎస్, ఐపీఎస్ చదివి కలెక్టర్లు, ఎస్పీలుగా బాధ్యతలు నిర్వహిస్తున్న వారు తెలివితక్కువ వాళ్లా? టీచర్లకు మాత్రమే తెలివి ఉందా? దేశంలో అత్యంత కఠినమైన పోటీ పరీక్షలను ఎదుర్కొని, తమ ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరుకున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల మేధస్సును ఇంత తేలికగా తీసుకోవచ్చా? అన్న ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వానికి అధికారులను బదిలీ చేసే అధికారం ఉంటుంది. ఒక ఉత్తర్వుతో వారి పోస్టింగ్‌ను మార్చవచ్చు. ఒక పెన్నుతో సంతకం చేసి ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు పంపవచ్చు. కానీ పోస్టింగ్ మార్చినంత మాత్రాన వారి జ్ఞానం మారిపోతుందా? వారి మేధస్సు తగ్గిపోతుందా? వారి అనుభవం చెరిగిపోతుందా? అన్న ప్రశ్నలకు మాత్రం సమాధానం ఉండదని విమర్శకులు అంటున్నారు. టీచర్ తెలివైనవాడే... సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుడి పాత్ర అత్యంత కీలకమైనదే. కానీ అదే సమయంలో కలెక్టర్ కూడా ప్రతిభావంతుడే... ఎస్పీ కూడా అత్యున్నత స్థాయి పరీక్షల్లో విజయం సాధించి బాధ్యతలు చేపట్టిన అధికారే. ఒకరిని గొప్పగా చూపించడానికి మరొకరిని చిన్నచూపు చూడాల్సిన అవసరం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. టీచర్లను పొగడండి సీఎం గారూ... కానీ అందుకోసం ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల ప్రతిభను తక్కువ చేసేలా మాట్లాడాల్సిన అవసరం ఏముంది? ఒక పెన్ను సంతకంతో అధికారిని బదిలీ చేయవచ్చు గానీ, అతని జ్ఞానాన్ని బదిలీ చేయలేరు. కుర్చీని మార్చవచ్చు గానీ, కృషితో సంపాదించుకున్న అనుభవాన్ని చెరిపేయలేరు. పోస్టింగ్‌ను మార్చవచ్చు గానీ, ప్రతిభను మార్చలేరు. ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపించే కలెక్టర్లు, శాంతిభద్రతల పరిరక్షణలో కీలక బాధ్యతలు నిర్వర్తించే ఎస్పీలను "పెన్నుతో ట్రాన్స్‌ఫర్ చేయగలిగే వాళ్లు" అన్నట్టుగా మాట్లాడటం ద్వారా ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. అధికారులకు బాధ్యతలు అప్పగించే ప్రభుత్వం, అదే అధికారులను తమ సంతకంతో ఎప్పుడైనా మార్చగలమనే భావనను బహిరంగంగా ప్రదర్శించడం సరైన పరిపాలనా ధోరణేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పెన్నుతో ట్రాన్స్‌ఫర్ చేయగలిగేది పోస్టింగ్ మాత్రమే... మేధస్సు కాదు. సంతకంతో మార్చగలిగేది స్థానం మాత్రమే... జ్ఞానం కాదు. ప్రభుత్వ ఉత్తర్వులతో మారేది కుర్చీ మాత్రమే... ఒక వ్యక్తి ప్రతిభ, అనుభవం, సామర్థ్యం కాదు. టీచర్‌కు ఉన్న గౌరవం ఎంత ముఖ్యమో, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల ప్రతిభకు కూడా అంతే గౌరవం ఉండాలి. ఒకరిని పొగడటానికి ఇంకొకరిని తగ్గించడం నాయకత్వమా? లేక మాటల తడబాటా? అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తానికి, "కలెక్టర్, ఎస్పీ అంటే ఒక పెన్నుతో ఆడించే పదవులేనా?" అన్న ప్రశ్న ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తోంది. పోస్టింగులు ప్రభుత్వాలు మార్చవచ్చు... కానీ మేధస్సును కాదు. పదవులు బదిలీ కావచ్చు... కానీ ప్రతిభను బదిలీ చేయలేరు. ఒకరిని గౌరవించడానికి మరొకరి గౌరవాన్ని తగ్గించాల్సిన అవసరం లేదని సీఎం గుర్తుంచుకోవాలనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## గుండు సుధారాణికి టీఎన్జీవోస్ నేతల అభినందనలు

**నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన గుండు సుధారాణికి సన్మానం**

**ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతల అభినందనలు**

**పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘన సత్కారం**

**కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా నేతల పాల్గొనడం**

**పలువురు ఉద్యోగ సంఘాల ప్రతినిధుల హాజరు**

**వరంగల్ (జై భీమ్ న్యూస్):**

హనుమకొండ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు కార్యాలయంలో నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ శ్రీమతి గుండు సుధారాణికి పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాస్య నాయక్, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, గౌరవ అధ్యక్షులు శ్యాంసుందర్, జిల్లా నేతలు కలకోట్ల భరత్, ప్రణయ్, పృథ్వి, రమేష్, వెంకటస్వామి, శ్రీనివాస్, ఆకుల సుధాకర్, అలీం, శ్రీధర్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.



# అంతర్మతం పేరుతో ఆర్ఎస్ఎస్ ఎత్తుగడ?










**మత పెద్దలను తప్పుదోవ పట్టించి భగవత్ వేదికపైకి తెచ్చారా?**

**న్యూయార్క్ కార్యక్రమంపై అమెరికన్ మత నాయకుల అభ్యంతరాలు**

**ఆర్ఎస్ఎస్ పాత్రను ముందుగా వెల్లడించలేదని ఆరోపణలు**

**అంతర్మత సామరస్యం పేరుతో ప్రచార ప్రయోజనాలా?**

**కార్యక్రమం పారదర్శకతపై తీవ్ర ప్రశ్నలు**

**డాక్టర్ బరిగెల శివ**

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్):**

ప్రపంచ మానవత్వం, మత సామరస్యం, అంతర్మత ఐక్యత అనే ఆకర్షణీయమైన నినాదాలతో నిర్వహించిన కార్యక్రమం వెనుక ఆర్ఎస్ఎస్ ప్రచార వ్యూహం దాగి ఉందనే ఆరోపణలు ఇప్పుడు న్యూయార్క్‌లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పాల్గొన్న "వన్ వరల్డ్, వన్ హ్యూమానిటీ" కార్యక్రమానికి హాజరైన ఇద్దరు ప్రముఖ అమెరికన్ మత నాయకులు, ఇది ఆర్ఎస్ఎస్‌కు సంబంధించిన కార్యక్రమమని లేదా మోహన్ భగవత్ ప్రధాన వ్యక్తిగా హాజరవుతారని తమకు ముందుగా తెలియజేయలేదని బహిరంగంగా ప్రకటించడం వివాదానికి కేంద్రబిందువుగా మారింది. అసలు విషయం తెలిసి ఉంటే తాము ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ కార్యక్రమంలో పాల్గొనేవాళ్లం కాదని వారు స్పష్టం చేయడంతో, అంతర్మత సమావేశం పేరుతో ప్రముఖ మత నాయకులను తప్పుదోవ పట్టించి, వారి హాజరును ఆర్ఎస్ఎస్‌కు అంతర్జాతీయ స్థాయిలో అంగీకారం ఉన్నట్లు చూపించేందుకు ఉపయోగించారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆగస్టు 29న న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో "వన్ వరల్డ్, వన్ హ్యూమానిటీ" పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ ప్రసంగించారు. వేలాది మంది అమెరికన్ హిందువులు, ప్రవాస భారతీయులు ఈ కార్యక్రమానికి హాజరైనట్లు సమాచారం. అయితే కార్యక్రమానికి ముందే దీనిపై పలు సామాజిక, మత సంస్థలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఆగస్టు 25న ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్‌తో పాటు పలు సంస్థలు న్యూయార్క్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి భగవత్ కార్యక్రమాన్ని వ్యతిరేకించాయి. కార్యక్రమం జరిగిన తరువాత మాత్రం మరింత తీవ్రమైన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. భగవత్‌తో కలిసి వేదికపై లేదా అనుబంధ కార్యక్రమాల్లో కనిపించిన కొందరు మత నాయకులు, తాము హాజరవుతున్నది ఆర్ఎస్ఎస్‌కు సంబంధించిన కార్యక్రమమని నిర్వాహకులు ముందుగా చెప్పలేదని వెల్లడించారు. న్యూయార్క్‌లోని రివర్‌సైడ్ చర్చ్‌కు చెందిన మంత్రి అడ్రియెన్ థోర్న్ సెప్టెంబర్ 2న విడుదల చేసిన వీడియో సందేశంలో తనను మోసం చేసి కార్యక్రమంలో పాల్గొనేలా చేశారని తీవ్రంగా ఆరోపించారు. 'ది వరల్డ్ కౌన్సిల్ ఆఫ్ రిలీజియస్ లీడర్స్' అనే సంస్థ నుంచి తనకు సుమారు ఆరు వారాల పాటు పదేపదే ఆహ్వానాలు వచ్చాయని, అయితే ఇది కేవలం ఒక అంతర్మత సమావేశమని మాత్రమే తనకు వివరించారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఉందని గానీ, హిందుత్వ జాతీయవాదంతో సంబంధం ఉన్న మోహన్ భగవత్ ప్రధాన వ్యక్తిగా ఉంటారని గానీ తనకు ఎప్పుడూ చెప్పలేదని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో తాను కనిపించడం ఒక భయంకరమైన తప్పిదమని, అసలు విషయం ముందుగానే తెలిసి ఉంటే ఎట్టి పరిస్థితుల్లోనూ హాజరయ్యేదాన్ని కాదని స్పష్టం చేశారు. పాల్గొనేవారికి పంపిన కార్యక్రమ వివరాల్లో "గౌరవ అతిథి" పేరును ఖాళీగా ఉంచారని, తరువాత ఆ స్థానం మోహన్ భగవత్‌కు కేటాయించినట్లు తెలిసిందని ఆమె చెప్పడం కూడా నిర్వాహకుల పారదర్శకతపై అనుమానాలను మరింత పెంచింది. థోర్న్ ప్రకటన అనంతరం న్యూయార్క్‌కు చెందిన ప్రముఖ ముస్లిం మత నాయకుడు, అంతర్మత కార్యకర్త ఇమామ్ షంసీ అలీ కూడా ఇదే తరహా వివరణ ఇవ్వడం గమనార్హం. ది పియర్ హోటల్‌లో జరిగిన అనుబంధ అల్పాహార సమావేశానికి హాజరు కావడం తన తీవ్రమైన నిర్ణయపరమైన తప్పిదమని ఆయన పేర్కొన్నారు. "వన్ వరల్డ్, వన్ హ్యూమానిటీ" అనే అంశంతో జరిగే ఒక సమావేశానికి తనను ఆహ్వానించారని, అయితే మోహన్ భగవత్ ప్రధాన అతిథిగా ఉంటారని తనకు ముందుగా చెప్పలేదని తెలిపారు. ఈ కార్యక్రమం భగవత్‌ను సత్కరించేందుకు, ఆయనను కేంద్రంగా చేసుకుని నిర్వహిస్తున్నదని తెలిసి ఉంటే తాను వెంటనే ఆహ్వానాన్ని తిరస్కరించేవాడినని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమం అసలు స్వరూపం గురించి మరింత సమాచారం తెలుసుకున్న తరువాత మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరిగే తదుపరి కార్యక్రమానికి హాజరుకావడానికి కూడా తాను నిరాకరించినట్లు తెలిపారు. ఈ పరిణామాలన్నీ కలిపి చూస్తే ఒక కీలకమైన ప్రశ్న ముందుకు వస్తోంది. కార్యక్రమ నిర్వాహకులకు మోహన్ భగవత్ హాజరు విషయం ముందుగానే తెలిసి ఉంటే, ఆహ్వానించిన మత నాయకులకు మాత్రం ఎందుకు తెలియజేయలేదు? అంతర్మత సామరస్యం, ప్రపంచ మానవత్వం పేరుతో ఒక సమావేశాన్ని నిర్వహిస్తున్నామని చెప్పిన నిర్వాహకులు, ఆ సమావేశానికి ప్రధాన ఆకర్షణగా ఉండే వ్యక్తి పేరును ఎందుకు గోప్యంగా ఉంచాల్సి వచ్చింది? ఇది కేవలం సమాచార లోపమా, లేక భగవత్, ఆర్ఎస్ఎస్ పేర్లు ముందుగానే చెబితే పలువురు మత నాయకులు హాజరుకావడానికి నిరాకరిస్తారనే ఉద్దేశంతోనే ఈ విషయాన్ని దాచారా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. జూలై, ఆగస్టు నెలల్లో మత నాయకులకు పంపిన అనేక ఇమెయిళ్లలో ఆర్ఎస్ఎస్ లేదా మోహన్ భగవత్ పేర్లను స్పష్టంగా ప్రస్తావించలేదని వచ్చిన కథనాలు ఈ అనుమానాలను మరింత బలపరిచాయి. అయితే ఈ ఆహ్వానాల సమన్వయంలో కీలక పాత్ర పోషించిన బావా జైన్ మాత్రం మోహన్ భగవత్ ఈ కార్యక్రమానికి హాజరవుతారని తనకు చాలా కాలం ముందే తెలుసని చెప్పినట్లు సమాచారం. ఒకవైపు నిర్వాహకులతో సంబంధం ఉన్న వ్యక్తులకు భగవత్ రాక గురించి ముందుగానే తెలిసి ఉండగా, మరోవైపు కార్యక్రమానికి ఆహ్వానించిన ప్రముఖ మత నాయకులకు మాత్రం ఈ విషయం తెలియకపోవడం ఇప్పుడు తీవ్ర విమర్శలకు కారణమైంది. మత నాయకులను ఒక సాధారణ అంతర్మత సమావేశానికి ఆహ్వానించినట్లు నమ్మించి, తరువాత వారిని ఆర్ఎస్ఎస్ అధినేతతో ఒకే వేదికపై కనిపించేలా చేయడం వెనుక రాజకీయ, ప్రచార ప్రయోజనాలు ఉన్నాయా అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. అసలు విషయం తెలిసిన తరువాత అడ్రియెన్ థోర్న్ నిర్వాహకులను సంప్రదించి వివరణ కోరినట్లు సమాచారం. మోహన్ భగవత్ హాజరు విషయాన్ని ముందుగానే వెల్లడించకపోవడానికి భద్రతా కారణాలు ఉన్నాయని నిర్వాహకులు చెప్పినట్లు ఆమె తెలిపారు. అయితే భద్రతా కారణాలు ఉన్నాయనే పేరుతో ఆహ్వానితులకు కార్యక్రమ అసలు స్వరూపాన్ని దాచిపెట్టడం సమర్థనీయం కాదని థోర్న్ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతర్మత సమావేశం అంటే వివిధ మతాల నాయకులు పరస్పర అవగాహనతో, పూర్తి సమాచారం ఆధారంగా పాల్గొనే వేదిక కావాలి. కానీ ఒక ప్రముఖ రాజకీయ–సిద్ధాంతపరమైన సంస్థ అధినేత ప్రధాన వ్యక్తిగా ఉన్న కార్యక్రమంలో ఆ విషయాన్ని చెప్పకుండా ఇతర మతాల నాయకులను ఆహ్వానించడం పారదర్శకతకు విరుద్ధమనే విమర్శలు వస్తున్నాయి. ఈ వివాదంలో మరో అంశం కూడా తీవ్ర చర్చకు దారితీసింది. కార్యక్రమానికి హాజరైన మత నాయకులు, సంస్థల నుంచి ముందుగానే కొన్ని కట్టుబాట్లు లేదా అభిప్రాయాలను సేకరించినట్లు సమాచారం. అయితే తరువాత ఆ కట్టుబాట్లను ఒక ప్రకటన రూపంలో సంకలనం చేసి, మోహన్ భగవత్ స్వయంగా బహిరంగంగా చదివారని ఆరోపణలు వచ్చాయి. అనంతరం ఆ ప్రకటనను ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగా ఉన్న పత్రికలో ప్రచురించినట్లు కూడా విమర్శలు వ్యక్తమయ్యాయి. తాము ఇచ్చిన కట్టుబాట్లను లేదా అభిప్రాయాలను మోహన్ భగవత్ బహిరంగంగా చదివి, వాటిని ఆర్ఎస్ఎస్ కార్యక్రమానికి సంబంధించిన ప్రకటనగా ప్రచారం చేస్తారని ఆహ్వానితులకు ముందుగా తెలియజేయలేదని ఆరోపిస్తున్నారు. దీంతో స్వతంత్రంగా ఇచ్చిన అభిప్రాయాలు, మత సామరస్యం పేరుతో సేకరించిన కట్టుబాట్లను ఆర్ఎస్ఎస్ ప్రచారానికి ఉపయోగించారా అనే సందేహాలు మరింత బలపడుతున్నాయి. బావా జైన్‌కు సంబంధించిన అంతర్మత సంస్థలు తమను స్వతంత్ర వేదికలుగా పరిచయం చేసుకున్నప్పటికీ, సంఘ్ పరివార్‌తో సంబంధం ఉన్న వ్యక్తులు, సంస్థలతో గతంలోనూ సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో జరిగిన పలు ప్రపంచ శాంతి, అంతర్మత, మత నాయకత్వ సమావేశాల్లో ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్‌కు చెందిన నాయకులు పాల్గొన్న విషయాలను కూడా విమర్శకులు ప్రస్తావిస్తున్నారు. దీంతో అంతర్మత వేదికల పేరుతో పనిచేస్తున్న కొన్ని సంస్థలు నిజంగా అన్ని మతాల మధ్య సమాన సంభాషణ కోసం పనిచేస్తున్నాయా, లేక హిందుత్వ సంస్థలకు అంతర్జాతీయ స్థాయిలో సామాజిక అంగీకారం కల్పించేందుకు వేదికలుగా మారుతున్నాయా అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. పాల్గొనేవారిని సంప్రదాయ మతపరమైన దుస్తులతో రావాలని కోరినట్లు వచ్చిన ఆరోపణలు కూడా ఈ కార్యక్రమం వెనుక ఉన్న ప్రచార కోణంపై అనుమానాలకు కారణమయ్యాయి. వివిధ మతాలకు చెందిన ప్రముఖులు తమ తమ సంప్రదాయ దుస్తుల్లో మోహన్ భగవత్‌తో కలిసి ఒకే వేదికపై కనిపిస్తే, ఆ దృశ్యాలను తరువాత ఆర్ఎస్ఎస్‌కు అంతర్జాతీయ మత నాయకుల మద్దతు ఉన్నట్లు ప్రచారం చేసుకునేందుకు ఉపయోగించవచ్చనే విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకే ఈ కార్యక్రమం నిజంగా మతాల మధ్య సంభాషణ కోసం నిర్వహించబడిందా, లేక ప్రముఖ మత నాయకుల హాజరును ఒక ఫోటో అవకాశంగా మార్చి, ఆర్ఎస్ఎస్‌కు అంతర్జాతీయ స్థాయిలో అంగీకారం ఉన్నట్లు చూపించేందుకు రూపొందించిన ప్రచార కార్యక్రమమా అనే ప్రశ్నలు మరింత బలపడుతున్నాయి. "వన్ వరల్డ్, వన్ హ్యూమానిటీ" అనే నినాదం ప్రపంచ మానవత్వం, ఐక్యత, సమానత్వం అనే గొప్ప భావాలను సూచించినప్పటికీ, అదే వేదికకు హాజరైన ప్రముఖ మత నాయకులే తమకు అసలు కార్యక్రమ స్వరూపం తెలియదని, తెలిసి ఉంటే తాము హాజరయ్యేవాళ్లం కాదని బహిరంగంగా ప్రకటించడం ఈ కార్యక్రమం నైతికతపై, పారదర్శకతపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. మానవత్వం పేరుతో నిర్వహించిన కార్యక్రమంలోనే నిజాలను దాచిపెట్టాల్సి వస్తే, ఆ మానవత్వ నినాదం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనే విమర్శలు సహజంగానే వస్తున్నాయి. ఒకవైపు ప్రపంచ ఐక్యత, మత సామరస్యం గురించి మాట్లాడుతూనే, మరోవైపు కార్యక్రమానికి ఆహ్వానించిన ప్రముఖ మత నాయకులకు పూర్తి సమాచారం ఇవ్వకుండా వారి హాజరును పొందడం, తరువాత వారి ఉనికిని భగవత్‌తో ముడిపెట్టి ప్రచారం చేయడం జరిగిందనే ఆరోపణలు ఇప్పుడు ఆర్ఎస్ఎస్‌పై తీవ్ర అనుమానాలకు దారితీశాయి. ఇద్దరు ప్రముఖ అమెరికన్ మత నాయకులే తాము తప్పుదోవ పట్టించబడ్డామని బహిరంగంగా చెప్పిన తరువాత కూడా దీనిని సాధారణ అపార్థంగా కొట్టిపారేయలేమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తంగా చూస్తే, అంతర్మత సామరస్యం అనే ముసుగులో మత నాయకులను ఆహ్వానించడం, ఆర్ఎస్ఎస్, మోహన్ భగవత్ పాత్రను ముందుగా స్పష్టంగా తెలియజేయకపోవడం, తరువాత వారి హాజరును ఒకే వేదికపై ప్రదర్శించడం, కట్టుబాట్లు మరియు అభిప్రాయాలను ఒక ప్రకటనగా మార్చి భగవత్‌తో చదివించడం వంటి పరిణామాలపై నిర్వాహకులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందనే డిమాండ్ పెరుగుతోంది. "వన్ వరల్డ్, వన్ హ్యూమానిటీ" పేరుతో జరిగిన ఈ కార్యక్రమం నిజంగా మానవత్వం కోసం జరిగిందా, లేక ఆర్ఎస్ఎస్‌కు అంతర్జాతీయ స్థాయిలో అంగీకారం, మద్దతు ఉన్నట్లు చూపించేందుకు రూపొందించిన మరో ప్రచార ఎత్తుగడగా మారిందా అన్న ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది. మత సామరస్యం పేరుతో నిజాలను దాచిపెట్టి, ప్రముఖ మత నాయకులను వేదికపైకి తీసుకువచ్చి, వారి హాజరును ఆర్ఎస్ఎస్ ప్రచారానికి ఉపయోగించారనే ఆరోపణలు మాత్రం ఈ కార్యక్రమంపై తీవ్రమైన నీడను వేశాయి.

# జర్నలిస్టుల ప్రతిభకు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం..

**12 విభాగాల్లో ఉత్తమ జర్నలిస్టు అవార్డులు**
**రూ.2 లక్షల నుంచి రూ.1 లక్ష వరకు నగదు**
**పురస్కారాలు సెప్టెంబర్ 28లోగా దరఖాస్తులకు అవకాశం**




**విజయవాడ,సెప్టెంబర్ 5 (జై భీమ్ న్యూస్)**

జర్నలిజం రంగంలో విశేష సేవలందిస్తూ, వృత్తిపరమైన నిబద్ధతతో పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న పాత్రికేయుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను 12 విభాగాల్లో ఉత్తమ జర్నలిస్టు అవార్డులను అందజేయాలని నిర్ణయించింది. అర్హులైన జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. అవార్డులకు అర్హులైన వారు తమ దరఖాస్తులను పూర్తి వివరాలు, అవసరమైన ఆధారాలతో 2026 సెప్టెంబర్ 28వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు డైరెక్టర్, సమాచార పౌరసంబంధాల శాఖ, 2వ అంతస్తు, ఎన్టీఆర్ పరిపాలన భవనం, పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్, విజయవాడ--520013 చిరునామాకు పంపించాలని సూచించారు. ఈ పురస్కారాల్లో కొన్ని అవార్డులను జర్నలిస్టుల నుంచి ప్రత్యేకంగా దరఖాస్తులు స్వీకరించకుండా ఎంపిక కమిటీ తన విచక్షణాధికారంతో ప్రకటించనుంది. వి.ఆర్. నార్ల జీవిత సాఫల్య పురస్కారం, కొక్కు అహోబలరావు ఉత్తమ ఫోటో జర్నలిస్టు అవార్డు, మద్దూరి అన్నపూర్ణయ్య పేరిట చిన్న, మధ్యతరహా వార్తాపత్రికల సంపాదకులకు అందించే అవార్డులకు కమిటీ స్వయంగా అర్హులను ఎంపిక చేయనుంది. దరఖాస్తుల ఆధారంగా ఎంపిక చేసే అవార్డుల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ఉత్తమ జర్నలిస్టు అవార్డుకు రూ.2 లక్షల నగదు పురస్కారం అందజేయనున్నారు. జర్నలిజం వృత్తిలో కనీసం 10 సంవత్సరాల అనుభవం కలిగి, వృత్తిపరమైన ప్రతిభను కనబరిచిన పూర్తికాలపు జర్నలిస్టులు ఈ అవార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే గ్రామీణ ప్రాంతాల సమస్యలు, సామాజిక అంశాలపై విశేషమైన రిపోర్టింగ్ చేసిన జర్నలిస్టుల కోసం ఖాసా సుబ్బారావు, ముట్నూరి కృష్ణారావు, మద్దుకూరి చంద్రశేఖరరావు పేర్లతో మూడు ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డులను ప్రకటించారు. ఒక్కో అవార్డుకు రూ.1 లక్ష నగదు పురస్కారం అందజేయనున్నారు. మహిళా పాత్రికేయుల సేవలను గుర్తించేందుకు సావిత్రిబాయి పూలే ఉత్తమ మహిళా జర్నలిస్టు అవార్డును రూ.1 లక్ష నగదు పురస్కారంతో అందించనున్నారు. రాష్ట్రంలో వెలువడుతున్న తెలుగు, ఆంగ్ల వార్తాపత్రికలు, పీరియాడికల్స్‌లో పనిచేస్తున్న మహిళా రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు దీనికి అర్హులు. అదేవిధంగా కనీసం 10 సంవత్సరాల అనుభవం కలిగిన కార్టూనిస్టుల కోసం ఉత్తమ కార్టూనిస్టు అవార్డు, ఉర్దూ జర్నలిజంలో విశేష సేవలందించిన వారికి అబుల్ కలాం ఆజాద్ ఉత్తమ ఉర్దూ జర్నలిస్టు అవార్డులను కూడా రూ.1 లక్ష నగదు పురస్కారంతో అందించనున్నారు. ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో పనిచేస్తున్న పాత్రికేయులకు కూడా ప్రత్యేక గుర్తింపు లభించనుంది. కనీసం ఐదు సంవత్సరాల అనుభవం కలిగి ఆంధ్రప్రదేశ్‌లో ప్రసారమవుతున్న ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, దూరదర్శన్, రేడియోలో పనిచేస్తున్న జర్నలిస్టులు ఉత్తమ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అవార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చు. అదే విధంగా ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న, కనీసం ఐదు సంవత్సరాల అనుభవం కలిగిన వీడియో జర్నలిస్టులు ఉత్తమ వీడియో జర్నలిస్టు అవార్డుకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ రెండు విభాగాల్లోనూ ఎంపికైన వారికి రూ.1 లక్ష చొప్పున నగదు పురస్కారం అందజేయనున్నారు. అవార్డులకు దరఖాస్తు చేసుకునే జర్నలిస్టులు తాము పనిచేస్తున్న సంస్థ, ఉద్యోగ వివరాలు, వృత్తిపరమైన అనుభవం, ఇతర అర్హతలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని దరఖాస్తులో పేర్కొనాల్సి ఉంటుంది. దరఖాస్తుతో పాటు కనీసం ఐదు వ్యాసాలు, వార్తా కథనాలు, ఫొటోలు, కార్టూన్లు లేదా వీడియో క్లిప్పింగ్స్‌ను జతచేయాలి. అయితే అవి తప్పనిసరిగా 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రచురితమైనవి లేదా ప్రసారమైనవి అయి ఉండాలని నిబంధన విధించారు. అవసరమైతే వార్తా కథనాలు, వ్యాసాల ఫొటోకాపీలను కూడా సమర్పించవచ్చు. అవార్డు గ్రహీతల ఎంపికలో ఎంపిక కమిటీదే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. ఏదైనా విభాగంలో తగిన సంఖ్యలో దరఖాస్తులు అందకపోయినా, లేదా అవసరమైన ప్రమాణాలు ఉన్న అభ్యర్థులు లేరని కమిటీ భావించినా ఆ విభాగంలోని అవార్డును ప్రకటించకుండా నిలిపివేసే అధికారం కమిటీకి ఉంటుందని తెలిపారు. జర్నలిజం వృత్తిలో నిబద్ధత, నాణ్యత, ప్రజా ప్రయోజనం కోసం పనిచేసిన పాత్రికేయుల సేవలను రాష్ట్ర స్థాయిలో గుర్తించి గౌరవించే ఉద్దేశంతో ఈ పురస్కారాలను అందజేస్తున్నట్లు సమాచారం. ఉత్తమ జర్నలిస్టు పురస్కారాలకు సంబంధించిన పూర్తి అర్హతలు,దరఖాస్తు విధానం,ఇతర నిబంధనలను సమాచార పౌరసంబంధాల శాఖ మీడియా రిలేషన్స్ వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చు.

# టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదు






**వ్యక్తి వికాసం, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర**
**ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా బోధనా పద్ధతుల మార్పు అవసరం**
**ఏఐ సహాయకారే.. విలువలు నేర్పడంలో ఉపాధ్యాయుడిదే ప్రధాన పాత్ర**
**యువతను మానవ వనరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే**
**టీచర్స్ డే సందర్భంగా ఉపాధ్యాయులకు ఘన సన్మానం**

**వరంగల్ (జై భీమ్ న్యూస్):**

వ్యక్తి వికాసం, సమాజ నిర్మాణం, జాతి ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని, ఆధునిక సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ "టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదు" అని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 138వ జయంతిని పురస్కరించుకుని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీచర్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య వి. రామచంద్రం కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల మనస్తత్వం, ఆలోచనా విధానం, వైఖరిలో గణనీయమైన మార్పులు వస్తున్నాయని అన్నారు. ఈ మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా తమ జ్ఞానాన్ని, నైపుణ్యాలను నిరంతరం నవీకరించుకుంటూ ఆధునిక బోధనా పద్ధతులను అవలంబించాలని సూచించారు. కృత్రిమ మేధ (ఏఐ) విస్తరిస్తున్న ప్రస్తుత కాలంలో సాంకేతికత ఉపాధ్యాయుడికి సహాయకారిగా ఉపయోగపడుతుందని, అయితే విద్యార్థుల్లో విలువలు, మానవీయత, బాధ్యత, క్రమశిక్షణ, మంచి పౌరసత్వం వంటి లక్షణాలను పెంపొందించి వారిని పరిపూర్ణ వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుడి పాత్రకు ప్రత్యామ్నాయం లేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓఎస్డీ, ఎడ్‌సెట్ కన్వీనర్ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ దేశ జనాభాలో సుమారు 33 శాతం యువత ఉన్నారని, ఈ యువశక్తిని సమర్థవంతమైన మానవ వనరులుగా తీర్చిదిద్దే గొప్ప బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని పేర్కొంటూ, ఒక సమర్థవంతమైన ఉపాధ్యాయుడు సమాజంలోని అనేక రంగాలకు అవసరమైన నిపుణులను తీర్చిదిద్దగలరని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధికి విశిష్ట సేవలు అందించిన పూర్వపు ఆచార్యులను ఆయన స్మరించుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం విద్యా విభాగం డీన్ ఆచార్య ఎన్. రామనాథ్ కిషన్ మాట్లాడుతూ కృత్రిమ మేధను బాధ్యతాయుతంగా, జాగ్రత్తగా వినియోగిస్తూ జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఉపాధ్యాయుడు బోధకుడిగానే కాకుండా మార్గదర్శి, సలహాదారు, పరిశోధకుడు, సమాజ నిర్మాతగా అనేక బాధ్యతలను నిర్వహిస్తున్నారని వివరించారు. పాలకమండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి దిశానిర్దేశకులని, మానవ విలువలు, నైతికత, సామాజిక బాధ్యతలను విద్యార్థుల్లో పెంపొందించడంలో వారికి గురుతర బాధ్యత ఉందన్నారు. సహాయ రిజిస్ట్రార్ డాక్టర్ కోలా శంకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని, కొనలేనివని పేర్కొన్నారు. సమాజ భవిష్యత్తును నిర్మించే మహత్తర బాధ్యతను ఉపాధ్యాయులు నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాస్ కళాశాల సాధిస్తున్న విద్యా, పరిపాలనా ప్రగతిని వివరించారు. కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరుస్తూ ఉన్నత స్థానాలను సాధిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధితో పాటు నాణ్యమైన ఉపాధ్యాయులను తీర్చిదిద్దడమే కళాశాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో సేవలందిస్తున్న ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ వారికి టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అత్యంత ఉత్సాహంగా టీచర్స్ డే వేడుకలను నిర్వహించారు.




## ఈహెచ్ఎస్... ఆరోగ్య భద్రత ఎక్కడ? కార్డు చేతిలో... చికిత్స కోసం ఎదురుచూపులే!







**హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో అమలు చేస్తున్న ఉద్యోగుల ఆరోగ్య పథకంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. పేరుకు మాత్రం ఆరోగ్య భద్రత అంటూ ప్రచారం చేస్తున్నా, అనారోగ్యానికి గురైన సమయంలో సకాలంలో వైద్య సేవలు అందకపోతే ఆ భద్రత ఎక్కడ ఉందని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. చేతిలో ఆరోగ్య పథకం కార్డు ఉన్నప్పటికీ, ఆసుపత్రిలో చికిత్స పొందే విషయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. చికిత్స కోసం ఆసుపత్రుల చుట్టూ తిరగడం, అనుమతుల కోసం ఎదురుచూడటం, అవసరమైన వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలపై ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. "కార్డు ఇచ్చారు... కానీ కష్టకాలంలో చికిత్సకు భరోసా ఇచ్చారా?" అనే ప్రశ్న ఇప్పుడు బాధితుల నుంచి వినిపిస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో కూడా వైద్య సేవల కోసం ఎదురుచూడాల్సి వస్తే, ఈ ఆరోగ్య పథకం అసలు లక్ష్యం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ సేవలో ఎన్నో సంవత్సరాలు పనిచేసిన ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన పెన్షనర్లు తమ ఆరోగ్య సమస్యల సమయంలో కూడా వైద్య సేవల కోసం ఇబ్బందులు పడాల్సి రావడం బాధాకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్లకు సులభంగా, వేగంగా, ఎలాంటి అవరోధాలు లేకుండా వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డిమాండ్ చేస్తున్నారు. పథకం పేరులో ఆరోగ్య భద్రత ఉండటం మాత్రమే సరిపోదని, ఆసుపత్రి గడప వద్ద నిజంగా వైద్య సేవలు అందినప్పుడే ఆ పేరుకు అర్థం ఉంటుందని విమర్శలు వస్తున్నాయి. ప్రకటనల్లో గొప్పలు చెప్పడం కంటే, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యంతో సంబంధం ఉన్న అంశంలో నిర్లక్ష్యం తగదని, ఉద్యోగులు, పెన్షనర్లు చికిత్స కోసం ఇబ్బందులు పడకుండా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పేరు మాత్రం ఆరోగ్య భద్రత... కానీ అవసరమైన సమయంలో వైద్య భరోసా ఏది? కార్డు చేతిలో ఉన్నా చికిత్సపై సందేహాలు ఉంటే... అది ఆరోగ్య భద్రత కాదు, ప్రభుత్వ వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## నకిరేకల్ వేదికగా 'రెడ్డిల రాజ్యం'పై చర్చ

**రేవంత్-రాజగోపాల్ రెడ్డి ఆత్మీయతపై విమర్శలు!**






**నకిరేకల్ (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ఇప్పటికే అనేక వర్గాల నుంచి వస్తున్న విమర్శలకు నకిరేకల్‌లో జరిగిన భారీ బహిరంగ సభ మరో చర్చకు తెరలేపిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేసిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో వేదికపై ఆత్మీయంగా కనిపించిన దృశ్యాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. బహిరంగ సభ వేదికపై రాజగోపాల్ రెడ్డిని ఘనంగా సన్మానించడం, ఇద్దరూ చేతులు కలుపుకుని ఆత్మీయంగా మాట్లాడుకోవడం, పరస్పరం సన్నిహితంగా వ్యవహరించడం అక్కడ ఉన్న ప్రజలను మాత్రమే కాదు, వేదికపై ఉన్న పలువురినీ ఆశ్చర్యానికి గురి చేసినట్లు రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. నిన్నటి వరకు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్న నాయకులు, రాజకీయ సమీకరణాలు మారగానే ఒకే వేదికపై ఆత్మీయంగా కలిసిపోవడం వెనుక రాజకీయ ప్రయోజనాలే ప్రధాన కారణమా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రజా సమస్యలు, సామాజిక న్యాయం, బహుజన వర్గాల ప్రాతినిధ్యం వంటి అంశాల కంటే అధికార రాజకీయాలు, అగ్రకుల ఆధిపత్య రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. "ఎంత చెప్పుకున్నా... ఎంత విమర్శించుకున్నా... చివరకు అధికార రాజకీయాల్లో కలిసేది వారేనా?" అనే ప్రశ్న ఇప్పుడు నకిరేకల్ సభ అనంతరం చర్చకు వచ్చింది. తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో ఒక వర్గానికి చెందిన నాయకుల రాజకీయ ఆధిపత్యం పెరుగుతోందని, కీలక పదవులు, రాజకీయ నిర్ణయాలు, అధికార సమీకరణాల్లో అదే వర్గం ప్రభావం ఎక్కువగా కనిపిస్తోందని విమర్శకులు ఆరోపిస్తున్నారు. రేవంత్ రెడ్డి--రాజగోపాల్ రెడ్డి వేదికపై కనిపించిన ఈ ఆత్మీయ దృశ్యాలు కూడా "తెలంగాణలో కాంగ్రెస్ పాలన అంటే రెడ్డిల రాజకీయ రాజ్యమేనా?" అనే చర్చకు మరింత బలం చేకూర్చాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రజల కోసం రాజకీయాలు చేస్తున్నామని చెప్పుకునే నాయకులు, ఎన్నికల సమయంలో ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేయడం, అనంతరం రాజకీయ అవసరాల కోసం ఒకే వేదికపై చేతులు కలపడం చూస్తున్న ప్రజలు మాత్రం ఇదంతా సిద్ధాంతాల రాజకీయమా... లేక అధికార ప్రయోజనాల రాజకీయమా? అంటూ ప్రశ్నిస్తున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# సిబిసి సంఘానికి సహాయకుడు ప్రేమ్ చంద్రశేకర్

**సిబిసి సంఘ సేవకుడు ప్రేమ్ చంద్రశేఖర్.**
**ఈసీ నెంబర్ గుండెపోగు ప్రేమ్ చంద్రశేఖర్ సేవలు అద్భుతం.**
**సంఘ పెద్దలు సంఘ కాపరుల సూచనలు తూచా తప్పకుండా పాటిస్తున్నారు.**
**క్రైస్తవ మిషనరీ ఆస్తులను కాపాడడంలో ధైర్యాన్ని ప్రదర్శిస్తున్నారు.**
**ర్యాలీలు, నిరసన కార్యక్రమాల్లో గంభీర స్వరంతో స్లొగన్స్ ఇస్తున్నారు.**
**సంఘ పెద్దలు చేస్తున్న పోరాటాలాకు సహకారంగా నిలుస్తున్నారు.**
**తగ్గింపు స్వభావం సంఘ కాపరుల వద్ద నేర్చుకున్న గొప్ప అనుభవం.**
**ప్రేమ్ చంద్రశేఖర్ సేవలను అభినందిస్తున్న సంఘ పెద్దలు.**

**హన్మకొండ జై భీమ్ న్యూస్:-**

హనుమకొండలోని సెంటినరీ బాప్టిస్ట్ సంఘ సేవలు విస్తరించబడడం క్రైస్తవ పరిచర్యకు ఎంతో ప్రఖ్యాతిగా నిలిచిపోవడం క్రైస్తవ సంఘానికి దక్కుతున్న గొప్ప అనుభవంతో పాటు క్రైస్తవ సమాజానికి గొప్ప అనుభూతిని కలిగిస్తుందని తెలియజేయడానికి ఎలాంటి సంకోసించాల్సిన పనిలేదని క్రైస్తవ సమాజం తెలుపుతుంది. 146 సంవత్సరాల చరిత్ర కలిగిన సెంటినరీ బాప్టిస్ట్ సంఘం సేవలు పూర్తిస్థాయిలో విస్తరించబడుతుండడానికి ప్రధాన కారణం సంఘంలోని ఐక్యత, సంఘంలోని పట్టుదల, సంఘ కాపరుల సహకారం, సంఘ పెద్దలకు ప్రోత్సాహం, అన్ని విధాలుగా ఉపయోగపడుతుందని తెలిపాల్సి వుంది అందులో భాగంగానే సంఘంలో జరుగుతున్న ప్రతి సేవా కార్యక్రమాల్లో సంఘంలో జరుగుతున్న ప్రతి పరిచర్య కార్యక్రమాల్లో సంఘంలోని మిషనరీ ఆస్తుల రక్షణ కొరకు జరుగుతున్న ప్రతి పోరాటాలలో నిరసనల్లో ర్యాలీలలో తన ప్రత్యేకతను చాటుకుంటూ ముందుకు సాగుతున్న గుండె పోగు ప్రేమ్ చంద్రశేఖర్ ప్రత్యేకంగా నిలుస్తూ సంవత్సరాల తరబడి సంఘ పెద్దల మనసును ఆకర్షిస్తున్నాడని సంగతులు అభినందిస్తున్నారు. క్రైస్తవ మిషనరీ ఆస్తుల కోసం జరుగుతున్న ప్రతి పోరాటంలో ప్రేమ్ చంద్రశేఖర్ ప్రత్యేకంగా నిలుస్తూ తన పోరాట పటిమను కనపరుస్తుండడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంఘ ఆరాధన సమయంలో, సంఘం నిర్వహిస్తున్న ర్యాలీలో కానీ తన ప్రత్యేక సహకారాన్ని అందిస్తూ ముందుకు సాగుతున్న ప్రేమ్ చంద్రశేఖర్ తన తండ్రి గుండెపోవు పుల్లయ్య(ఇస్సాక్)ఆర్మీలో పని చేస్తున్న సందర్భంలో రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న అనుభవాన్ని తన తండ్రి వద్ద నేర్చుకొని క్రైస్తవ సంఘ సేవ కోసం సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ అభివృద్ధి కోసం దేవుని పరిచర్య కోసం అహర్నిశలు కృషి చేయడానికి ఎల్లవేళల సంసిద్ధంగా ఉండగలనని తన మనస్తత్వం తను చేస్తున్న సేవా కార్యక్రమాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం సెంటినరీ బాప్టిస్ట్ సంఘంలో ఈసీ మెంబర్గా పని చేస్తున్న గుండెపోగు ప్రేమ్ చంద్రశేఖర్ మరెన్నో సేవా కార్యక్రమాల్లో సంఘ అభివృద్ధి కొరకు ఇలాగే కృతనిశ్చుడై సేవలందించాలని ట్రైసిటీ క్రైస్తవ సమాజం తనపై చూపిస్తున్న అభిమానానికి మరిన్ని సేవలందించాలని కోరనైనది.



## ఉస్మానియా వేదికగా అఖిల భారత విశ్వవిద్యాలయ ఉద్యోగుల సమాఖ్య జాతీయ మహాసభలు

**సెప్టెంబర్ 10, 11, 12 తేదీల్లో నిర్వహణ.. విజయవంతం చేయాలని కేయూ సాంకేతిక ఉద్యోగుల సంఘం పిలుపు**




**హన్మకొండ, 5 సెప్టెంబర్ 2026(జై భీమ్ న్యూస్)**

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సెప్టెంబర్ 10, 11, 12 తేదీల్లో నిర్వహించనున్న 15వ అఖిల భారత విశ్వవిద్యాలయ ఉద్యోగుల సమాఖ్య జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కాకతీయ విశ్వవిద్యాలయం సాంకేతిక ఉద్యోగుల సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం కాకతీయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జాతీయ మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై జాతీయ మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. ఉద్యోగుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం, సేవా సమస్యలు తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఈ మహాసభలు కీలక వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి ఉద్యోగ ప్రతినిధులు ఈ జాతీయ మహాసభలకు హాజరుకానున్నారని తెలిపారు. విశ్వవిద్యాలయ ఉద్యోగుల సమస్యలను జాతీయ స్థాయిలో చర్చకు తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై మహాసభల్లో నిర్ణయాలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. కేయూ ఉద్యోగులు, సాంకేతిక సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కేయూ సాంకేతిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మెట్టు రవి, ప్రధాన కార్యదర్శి నలుబోల రాము, సహాయ కార్యదర్శి వై. రవికుమార్, కోశాధికారి వి. ప్రేమసాగర్, సంఘం నాయకులు కచకాయల్ చిరంజీవి, దామెర ఆనందం తదితరులు పాల్గొన్నారు.

## హసన్‌పర్తిలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**






**హసన్‌పర్తి, 5 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండలంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జరిగిన కార్యక్రమంలో మండల స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన 13 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన హసన్‌పర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆకుల మహేందర్ మాట్లాడుతూ తాను ఈ స్థాయికి ఎదగడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వృత్తిపట్ల మరింత అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందించిన 13 మంది ఉపాధ్యాయులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. తమ సేవలను గుర్తించి సన్మానించడం పట్ల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమాదేవి, సంపత్, రవికుమార్, రవీందర్, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు మధుకర్ రెడ్డి, నరేష్, శ్రీనివాస్, పొన్నం చందర్, శ్రీవర్ధన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 4 రాష్ట్రాల్లో జనగణన.. ఈ డిసెంబర్ 1 నుంచే షురూ!

న్యూఢిల్లీ,సెప్టెంబర్5(జై భీమ్ న్యూస్): కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, గోవాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఈ రాష్ట్రాల్లో జనగణన ప్రక్రియను కాస్త ముందుగానే నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి తాజాగా షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 1న జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఇది వచ్చే ఏడాది అంటే 2027 జనవరి 4 వరకు కొనసాగుతుంది. ఈ జనాభా గణనకు సంబంధించిన వివరాల్ని భారత రిజిస్ట్రార్ జనరల్ (=+× – రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా), సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే ఈ 4 రాష్ట్రాల్లోని ప్రజలు ముందుగానే వారి వివరాల్ని నమోదు చేసుకునేందుకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) సౌకర్యాన్ని కల్పించనున్నట్లు స్పష్టం చేశారు.

## కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు

**గురువుల మార్గదర్శకత్వమే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది: వక్తలు**



**వరంగల్, 5 సెప్టెంబర్ 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువుల సేవలను స్మరించుకుంటూ, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్రను కొనియాడారు. గురువుల పట్ల గౌరవం, కృతజ్ఞతాభావం ప్రతి విద్యార్థిలో ఉండాలని వక్తలు సూచించారు. ఈ సందర్భంగా తెలుగు విభాగం అధ్యక్షులు లింగయ్య మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యంత విశిష్టమైన స్థానం ఉందన్నారు. విద్యార్థులకు కేవలం విద్యాబోధన చేయడమే కాకుండా, వారిలో జ్ఞానాన్ని పెంపొందించి, ఉన్నత విలువలతో కూడిన బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. గురువులు చూపే మార్గదర్శకత్వం విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డా. చిర్ర రాజు మాట్లాడుతూ గురు--శిష్య సంబంధం భారతీయ విద్యా సంప్రదాయంలో ఎంతో ప్రాచీనమైనదని తెలిపారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థులు గురువుల బోధనలు, సూచనలను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలుగు విభాగ అధ్యాపకులు డా. కే. సదాశివ్, టి. అన్నపూర్ణ, డా. బానోత్ స్వామి పాల్గొని గురుపూజోత్సవ ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, జ్ఞానాభివృద్ధిలో గురువుల పాత్రను వివరించారు. గురువుల పట్ల గౌరవం, కృతజ్ఞతాభావం జీవితాంతం కొనసాగించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు తమ గురువులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి ఆశీస్సులు అందుకున్నారు. గురుపూజోత్సవ వేడుకలు విద్యార్థులు, అధ్యాపకుల మధ్య ఆత్మీయ వాతావరణంలో కొనసాగాయి.

## ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలి

**12 ఏళ్ల కిందటి కాలనీని 22ఏలో చేర్చారు**
**మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఫైర్**

**హైదరాబాద్,సెప్టెంబర్5(జై భీమ్ న్యూస్):**

రూపాయి రూపాయి కూడబెట్టుకుని నిర్మించుకున్న ఇళ్లను రాత్రికి రాత్రి 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ దారుణ నిర్ణయమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ భూముల సమస్యపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. అన్ని ప్రభుత్వ శాఖల అనుమతులతో 55 ఎకరాల్లో 1,500 ఇళ్ల నిర్మాణం జరిగి 12 ఏళ్లు గడుస్తోందని... ఇప్పుడు ఉన్నట్టుండి ఆ ఇళ్లను నిషేధిత జాబితాలో పెట్టడంపై కాలనీవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. బాధితుల పక్షాన పోరాడతానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసాన్ని ఏ దరఖాస్తు ఆధారంగా 22ఏ జాబితా నుంచి తొలగించారో, అదే నిబంధనలను సామాన్య ప్రజల ఆస్తులకు కూడా వర్తింపజేసి వెంటనే తొలగించాలని ఎంపీ రఘునందన్ రావు సూటిగా నిలదీశారు. కేవలం సాంకేతిక తప్పు జరిగిందని రెవెన్యూ మంత్రి క్షమాపణలు చెబితే సరిపోదని, తక్షణమే ఆ తప్పును సరిదిద్ది ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ 22ఏ జాబితా పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సామాన్యుడిని సమాజం గర్వించే గొప్ప వ్యక్తిగా తీర్చిదిద్దేది గురువే

**స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో ఘనంగా టీచర్స్ డే వేడుకలు**
**ఉపాధ్యాయులకు ఘన సన్మానం.. చిన్నారులకు పుస్తకాలు, స్టేషనరీ, మిఠాయిల పంపిణీ**




**హన్మకొండ, 5 సెప్టెంబర్ 2026(జై భీమ్ న్యూస్)**

ఒక సామాన్యుడిని సమాజం గర్వించే గొప్ప వ్యక్తిగా తీర్చిదిద్దేది ఒక్క గురువు మాత్రమేనని కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి, నాయిని నీలిమ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండ సర్క్యూట్ గెస్ట్‌హౌస్ సమీపంలోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో శుక్రవారం టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ అనితా రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నాయిని నీలిమ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆశ్రమంలోని ఉపాధ్యాయులను ముఖ్య అతిథులు ఘనంగా సన్మానించి, ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆశ్రమంలోని చిన్నారులు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అతిథులను అలరించారు. అనంతరం చిన్నారులకు పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి, మిఠాయిలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి, నాయిని నీలిమ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని అన్నారు. ఐఏఎస్, ఐపీఎస్, వైద్యులు, న్యాయవాదులు, రాజకీయ నాయకులు సహా ఏ రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారైనా ఒకప్పుడు గురువుకు శిష్యులేనని పేర్కొన్నారు. ప్రపంచానికి దిశానిర్దేశం చేయగల వ్యక్తులను తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయుడికి ఉందన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. స్పందన ఆశ్రమంలోని ఉపాధ్యాయుల సేవలను ప్రత్యేకంగా అభినందించిన వారు, మానసిక దివ్యాంగులు, బధిరులైన చిన్నారులకు బోధించడం ఎంతో ఓర్పు, ప్రేమ, అంకితభావంతో కూడుకున్న బాధ్యత అని అన్నారు. కల్మషం ఎరుగని చిన్నారులను తీర్చిదిద్దడంలో నిరంతరం సేవలందిస్తున్న ఉపాధ్యాయులను సన్మానించడం ద్వారా వారి సేవలను గౌరవించుకున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ సంస్థ నిర్వాహకులు సుచరిత, వసుధ, హరిత, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ ను దూషించలేదు

**కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**హైదరాబాద్,సెప్టెంబర్5(జై భీమ్ న్యూస్):**

కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై అవకాశం దొరికినప్పుడల్లా విమర్శనాస్త్రాలు సంధించే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒక్కసారిగా యు-టర్న్ తీసుకున్నారు. తాను రేవంత్ రెడ్డిని ఎప్పుడూ దూషించలేదని, కేవలం ఒకట్రెండు అంశాల్లో మాత్రమే అభిప్రాయ భేదాలు వచ్చాయని క్లారిటీ ఇచ్చారు. రేవంత్‌తో తనకు ఎలాంటి వ్యక్తిగత వైరం లేదని స్పష్టం చేసిన ఆయన, సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్, డిప్యూటీ సీఎం నియోజకవర్గం మధిర స్థాయిలోనే తన మునుగోడు నియోజకవర్గానికి కూడా రూ. 2 వేల కోట్ల నిధులు వచ్చాయని ప్రశంసల జల్లు కురిపించారు. త్వరలో జరగబోయే సీఎం బహిరంగ సభకు వేలాది మంది కార్యకర్తలతో తరలివెళతానని చెప్పారు.

# టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదు





### విలువలు, మానవీయత, బాధ్యతను పెంపొందించడంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకం: కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం

**వరంగల్, 5 సెప్టెంబర్ 2026(జై భీమ్ న్యూస్)**

వ్యక్తి, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థులను విలువలతో కూడిన పరిపూర్ణ వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 138వ జయంతిని పురస్కరించుకుని కాకతీయ విశ్వవిద్యాలయ విద్యా కళాశాలలో శుక్రవారం నిర్వహించిన టీచర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య రామచంద్రం మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల ఆలోచనా విధానం, మనస్తత్వం, వైఖరిలో గణనీయమైన మార్పులు వస్తున్నాయని, వాటిని అర్థం చేసుకుని ఉపాధ్యాయులు కూడా నిరంతరం తమను తాము అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కృత్రిమ మేధ (ఏఐ) విస్తరిస్తున్న నేపథ్యంలో సాంకేతికత ఉపాధ్యాయులకు సహాయకారిగా ఉపయోగపడుతుందని, అయితే విద్యార్థుల్లో మానవీయత, నైతిక విలువలు, బాధ్యత, మంచి పౌరసత్వం వంటి లక్షణాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుడి పాత్రను ఏ సాంకేతికతా భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. ఓఎస్డీ, ఎడ్‌సెట్ కన్వీనర్ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ.. దేశ జనాభాలో సుమారు 33 శాతం యువత ఉన్నారని, వారిని సమర్థవంతమైన మానవ వనరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని, ఒక ఉపాధ్యాయుడు అనేక రంగాలకు చెందిన నిపుణులను తీర్చిదిద్దగలరని పేర్కొన్నారు. విద్యా కళాశాల పూర్వపు ఆచార్యులు అందించిన సేవలను ఆయన ఈ సందర్భంగా స్మరించుకున్నారు. డీన్ ఆచార్య ఎన్. రామనాథ్ కిషన్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధను బాధ్యతాయుతంగా, జాగ్రత్తగా వినియోగిస్తూ జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. పాలకమండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి దిశానిర్దేశకులని, మానవ విలువలను పెంపొందించడంలో వారికి గురుతర బాధ్యత ఉందన్నారు. సహాయ రిజిస్ట్రార్ డాక్టర్ కోలా శంకర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని, వాటిని కొనలేమని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాస్ కళాశాల ప్రగతిని వివరించారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపిక, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సంగాని మల్లేశ్వర్, కళాశాల బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కాకతీయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన విద్యార్థులు



**వరంగల్, 5 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని విశ్వవిద్యాలయంలోని ప్రభుత్వ పాలన మరియు మానవ వనరుల విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మానవీయ శాస్త్ర భవనం ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు నాయకత్వం వహించారు. విభాగానికి చెందిన విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడంతో పాటు, విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపేందుకు తమ విభాగం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. 2019 సంవత్సరం నుంచి విభాగం ఆవరణలో విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులతో మొక్కలు నాటించడంతో పాటు, వాటి సంరక్షణలోనూ విభాగం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా "ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటండి.. సెల్ఫీ దిగండి.. సంతకం చేయించుకోండి" అనే నినాదంతో 2019 నుంచి విభాగం ఆవరణలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటిస్తున్నామని తెలిపారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఆయన సూచించారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు ముందుండి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు డా. ఆకుతోట శ్రీనివాసులు, డా. చీకటి శ్రీను, డా. బుర్రి ఉమాశంకర్, నాగేశ్వరరావు, దామెర దేవదాసు, మాదారపు సురేష్, నక్క చేరాలు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

**హైదరాబాద్,సెప్టెంబర్5(జై భీమ్ న్యూస్):**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 'మహా ధర్నా' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. "వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా వేతనం తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, కనీసం తన నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు" అని ఆరోపించారు. కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు.

## కాకతీయ విశ్వవిద్యాలయంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

### విద్యార్థులు క్రమశిక్షణతో విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి: ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు



**హన్మకొండ, 5 సెప్టెంబర్ 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలోని ప్రభుత్వ పాలన మరియు మానవ వనరుల నిర్వహణ విభాగంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావుతో పాటు విభాగంలోని అధ్యాపకులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరవుతూ విద్యాభ్యాసంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు అంకితభావం, క్రమశిక్షణతో ముందుకు సాగుతూ తమ విషయ పరిజ్ఞానాన్ని నిరంతరం పెంపొందించుకోవాలని అన్నారు. ఉన్నత విద్య ద్వారా సాధించగల అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలుస్తారని, విద్యార్థులు అధ్యాపకుల సూచనలు, సలహాలను పాటిస్తూ విద్యా, పరిశోధనా రంగాల్లో రాణించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోంది

### 22ఏతో ప్రజల భూములను లాక్కునే కుట్ర
### కేసీఆర్ ప్రభుత్వం బాటలో రేవంత్ కూడా..
### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**హైదరాబాద్,సెప్టెంబర్5(జై భీమ్ న్యూస్):**

సామాన్యుల ఆస్తులు, రైతుల పొలాలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. 22ఏ నిషిద్ధ జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల సొంత భూములను లాక్కునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో ఈరోజు జరిగిన మహాధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల భూములపై పడ్డ ఏ పాలకుడు చరిత్రలో బాగుపడలేదని హెచ్చరించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 'ధరణి'తో ప్రజలను పీడించి ఏ విధంగా అధికారానికి దూరమైందో... ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తూ తన గోతిని తానే తవ్వుకుంటున్నారని మండిపడ్డారు. హైడ్రా, క్యూర్, 22ఏ వంటి నిర్ణయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, 30 శాతం కమీషన్ల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో బీఆర్ఎస్ కంటే దారుణమైన పరాభవం తప్పదని స్పష్టం చేశారు. వెంటనే 22ఏ కింద చేర్చిన బాధితుల భూములపై రివ్యూ జరిపి, ఆ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ పర్యాటక అవార్డులు-2026కు దరఖాస్తుల ఆహ్వానం

### సెప్టెంబర్ 7లోగా దరఖాస్తులు సమర్పించాలి.. పర్యాటక రంగంలో విశేష కృషి చేసిన వారికి వివిధ విభాగాల్లో అవార్డులు

**హన్మకొండ, 5 సెప్టెంబర్ 2026(జై భీమ్ న్యూస్)**

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న తెలంగాణ రాష్ట్ర పర్యాటక అవార్డులు--2026ను ప్రదానం చేయనున్న నేపథ్యంలో రాష్ట్ర పర్యాటక శాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలు, ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, రిసార్టులు, పర్యాటక సంస్థలు తదితరులు ఈ అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. రచన/ప్రచురణ, తెలంగాణ పర్యాటకంపై ఉత్తమ చిత్రం, ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు, హోటళ్లు, రిసార్టులు, రెస్టారెంట్లు, పర్యాటక గైడ్, గ్రామీణ పర్యాటక ప్రాజెక్టు, పర్యాటక విద్యాసంస్థలు, వైద్య పర్యాటకం, వినోద పార్కులు, వినూత్న పర్యాటక ప్రాజెక్టులు, సామాజిక మాధ్యమాలు, యువ పర్యాటక క్లబ్ తదితర విభాగాల్లో అవార్డులను ప్రకటించనున్నట్లు పేర్కొంది. హోటళ్లు, రెస్టారెంట్లు, రిసార్టుల పనితీరు, వాతావరణం, పరిశుభ్రత, సేవలు, సౌకర్యాలు, పర్యాటకుల సంఖ్య, టర్నోవర్, విదేశీ మారకద్రవ్య ఆదాయం వంటి అంశాలను ఎంపికలో పరిగణనలోకి తీసుకోనున్నారు. అదే విధంగా పర్యావరణహిత విధానాలు, దివ్యాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పునరుత్పాదక ఇంధన వినియోగం, వ్యర్థాల నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, వినూత్న పద్ధతులు, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పర్యాటక రచనల విభాగంలో తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రచురితమైన వ్యాసాలు అర్హత పొందుతాయి. ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు, హోటళ్లు, వైద్య పర్యాటక సంస్థలు తదితరులు అవసరమైన చోట చార్టర్డ్ అకౌంటెంట్ లేదా చట్టబద్ధ ఆడిటర్ ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అవార్డుల ఎంపిక కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీలు దరఖాస్తులను పరిశీలించడంతో పాటు అవసరమైన సందర్భాల్లో సంబంధిత పర్యాటక ప్రాంతాలు, సంస్థలు, హోటళ్లు, రిసార్టులను స్వయంగా సందర్శించి పరిశీలించనున్నాయి. మార్గదర్శకాల్లో పేర్కొన్న అర్హతలు, పనితీరు, నాణ్యత, పర్యాటక రంగానికి అందించిన సేవలు తదితర అంశాల ఆధారంగా ఎంపిక జరుగుతుందని, ఎంపిక ప్రక్రియలో పర్యాటక శాఖ డైరెక్టర్ నిర్ణయమే తుది నిర్ణయమని శాఖ వెల్లడించింది. అర్హత కలిగిన వారు పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు మార్గదర్శకాల ప్రకారం అవసరమైన ప్రతిపాదనలు, ధ్రువపత్రాలు, ఫొటోగ్రాఫ్‌లు, ఇతర ఆధారాలను జతచేసి సెప్టెంబర్ 7, 2026లోగా సమర్పించాలి. దరఖాస్తులను డైరెక్టర్, పర్యాటక శాఖ, తెలంగాణ ప్రభుత్వం, కళా భవన్, రవీంద్ర భారతి, సైఫాబాద్, హైదరాబాద్--500004 చిరునామాకు పంపాలని సూచించింది. మరిన్ని వివరాల కోసం 9440816065, 9440816068 నంబర్లలో సంప్రదించవచ్చని పర్యాటక శాఖ తెలిపింది.

## రైతుల భూ సమస్యలకు రీ సర్వే కీలకం

### భూ సరిహద్దులు, విస్తీర్ణంపై స్పష్టత.. ఆధునిక సాంకేతికతతో భూ వివరాల నమోదు





**వరంగల్ జిల్లా, 5 సెప్టెంబర్ 2026(జై భీమ్ న్యూస్)**

రైతుల భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని వరంగల్ ఆర్డీవో సుమ తెలిపారు. రాయపర్తి మండలం కొండాపురం గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని రాయపర్తి తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీ సర్వే ప్రక్రియ, దాని ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. భూ సరిహద్దులు, భూ విస్తీర్ణం తదితర అంశాల్లో తలెత్తే సమస్యలకు రీ సర్వే ద్వారా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహిస్తున్న రీ సర్వే ద్వారా భూములకు సంబంధించిన వివరాలు మరింత స్పష్టంగా, కచ్చితంగా నమోదు చేయవచ్చని పేర్కొన్నారు. రీ సర్వే విజయవంతంగా పూర్తయ్యేందుకు రైతులందరూ అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. సర్వే సమయంలో అవసరమైన భూ పత్రాలను అందుబాటులో ఉంచుకుని, తమ భూములకు సంబంధించిన వివరాలను సక్రమంగా తెలియజేయాలని సూచించారు. మరోవైపు సంగెం మండలం ముమ్మిడివరం, గీసుకొండ మండలం ఎలుకుర్తి గ్రామాల్లో కొనసాగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే పనుల పురోగతిని, సర్వే నిర్వహణ తీరును పరిశీలించి సంబంధిత సర్వేయర్లకు పలు సూచనలు చేశారు. రీ సర్వే పనులను నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి తప్పులకు తావులేకుండా నిర్వహించాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమాల్లో మండల సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేసే ప్రతి టీచర్ ఉత్తముడే!





**విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట.. ప్రభుత్వ బడుల రూపురేఖల్లో గణనీయమైన మార్పులు హనుమకొండలో ఘనంగా గురుపూజోత్సవం.. ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం**

**హన్మకొండ, 5 సెప్టెంబర్ 2026(జై భీమ్ న్యూస్)**

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాది వేసే ప్రతి ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయురాలు ఉత్తములేనని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, సమాజాన్ని నిలబెట్టే గొప్ప బాధ్యతతో కూడుకున్నదని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాలను మాత్రమే కాకుండా సమాజాన్ని, భవిష్యత్ తరాన్ని ఉత్తమ మార్గంలో నడిపించగలరని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పూలమాల వేసి నివాళు లర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, ఉపాధ్యాయుల కృషితోనే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. తరగతి గదుల్లో పాఠ్యాంశాలతో పాటు మానవత్వపు విలువలను విద్యార్థులకు నేర్పుతున్న ఉపాధ్యాయులు నిరుపేద విద్యార్థుల భవిష్యత్తును ఉన్నత స్థానంలో నిలబెట్టేందుకు మరింత కృషి చేయాలని కోరారు. విద్యారంగం బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుండటంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయని అన్నారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయులను ఎన్నటికీ మర్చిపోరని, ఒక విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర ఎప్పటికీ చిరస్మరణీయమని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లాలో విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో పాఠశాల విద్యాశాఖ పరిధిలో 299 ప్రాథమిక పాఠశాలలు, 146 ప్రాథమికోన్నత పాఠశాలలు, 396 ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 841 పాఠశాలలు ఉన్నాయని, వీటిలో 1,56,995 మంది విద్యార్థులు చదువుతున్నారని కలెక్టర్ వెల్లడించారు. విద్యార్థుల నమోదు, హాజరు, అభ్యసన ఫలితాలు, ఎఫ్ఎల్ఎన్, డిజిటల్ విద్య, ఉపాధ్యాయుల సామర్థ్యాభివృద్ధి, సమాజ భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రభుత్వం, విద్యాశాఖ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక విద్యలో చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు బలంగా ఉన్నప్పుడే విద్యార్థి భవిష్యత్తులో విజయవంతంగా ముందుకు సాగగలడని కలెక్టర్ అన్నారు. పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ నైపుణ్యాలను అభివృద్ధి చేస్తూ వాటిని నమూనా పాఠశాలలుగా బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రగతిని ఆధారంగా చేసుకుని ఉపాధ్యాయులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, అవసరమైన విద్యార్థులకు టీచర్ సపోర్ట్ గ్రూప్స్ ద్వారా సహాయం అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా విధానాన్ని కొనసాగిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పూర్వ ప్రాథమిక విద్యార్థులకు ఆటపాటల ద్వారా వారి వయసుకు తగిన విద్యను అందిస్తున్నామని చెప్పారు. కేజీబీవీ విద్యార్థులకు నీట్, జేఈఈ మెయిన్స్, క్లాట్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. 2024--25 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 18వ స్థానంలో ఉన్న హనుమకొండ జిల్లా.. ఉపాధ్యాయుల సమష్టి కృషితో 2025--26 విద్యా సంవత్సరంలో 9వ ర్యాంకుకు చేరుకుందని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన స్థానాన్ని సాధించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని అన్నారు. బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించడం మాత్రమే లక్ష్యం కాదని, ప్రతి బిడ్డకు విద్యాబుద్ధులు నేర్పించి ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని కలెకర్ స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టిగా పనిచేస్తే హనుమకొండ జిల్లాను విద్యారంగంలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లగలమని అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా జిల్లాలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల గురించి జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు నెహ్రూ నాయక్, మనోజ్ కుమార్, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, ఏఎంఓ డాక్టర్ మన్మోహన్, సునీత, సుమా, పలువురు ప్రధానోపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హనుమకొండ : (జై భీమ్ న్యూస్)**

"అక్షర జ్ఞానంతో పాటు సంస్కారాన్ని నేర్పి, భావి భారత పౌరులను తీర్చిదిద్దుతున్న ఆదర్శ విద్యామూర్తికి ఘన సత్కారించారు.వరంగల్ జిల్లా రాయపర్తి మండలం, గన్నారం ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న నకరకంటి వసంత ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతగా ఎంపికైన సందర్భంగా శనివారం రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు శాలవతో సత్కరించి మెమెంట్ అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఐనవోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నకర కంటి మోహన్ గౌడ్ వసంత శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు.

## ఘనంగా పాత్ ఫైండర్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

ఐనవోలులోని పాత్‌ఫైండర్ హై స్కూల్లో భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు తమ గురువులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉపాధ్యాయుల పట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాల్లో మార్గదర్శకులుగా నిలుస్తూ, వారిలో జ్ఞానం, క్రమశిక్షణ, నైతిక విలువలు మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ సుభానొద్దీన్ తెలిపారు.డైరెక్టర్ ఒ చైర్మన్ డా. ఎల్.ఎన్. ఎన్. వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, విద్యార్థుల భవిష్యత్తును నిర్మించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత గొప్పదని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులు చేస్తున్న అంకితభావంతో కూడిన సేవలను ఆయన అభినందించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, "ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి జీవితాన్నే కాదు, ఒక సమాజం భవిష్యత్తును కూడా మార్చగలడు" అని అన్నారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయుల బోధనను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.విద్యార్థులు ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి, పాటలు, ప్రసంగాలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో కలిసి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు సిబ్బంది పాల్గొన్నారు..

## కేటీఆర్‌కు తృటిలో తప్పిన ప్రమాదం..

హైదరాబాద్,సెప్టెంబర్5(జై భీమ్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తృటిలో రోడ్డు ప్రమాదం నుంచి బయటపడ్డారు. కరీంనగర్‌కు వెళు తుండగా శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆయన ప్రయాణిస్తున్న కారు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ, కేటీఆర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కరీంనగర్‌లో నిర్వహించ తలపెట్టిన విద్యార్థి, యువజన సదస్సులో పాల్గొనేందుకు కేటీఆర్ శనివారం బయలుదేరారు. మార్గమధ్యలో అలుగునూరు వద్ద ఆగగా, పార్టీ కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడ కార్యక్రమం ముగించుకుని ప్రయాణం తిరిగి ప్రారంభమైన వెంటనే, కారుకు సమాంతరంగా వెళుతున్న ఒక లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు వెనుక భాగంలోని డోర్ తీవ్రంగా దెబ్బతింది. ప్రమాద సమయంలో కేటీఆర్ కారులోనే ఉన్నప్పటికీ, ఆయన సురక్షితంగా బయటపడటంతో పార్టీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి. కేటీఆర్ ప్రయాణాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఇదే మొదటిసారి కాదు. ఈ ఏడాది జులైలో జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ వద్ద ఆయన కాన్వాయ్‌లోని రెండు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఆ ప్రమాదంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు గాయాలయ్యాయి.

## ఎవరు పడితే వాళ్లను పార్టీలోకి చేర్చుకోబోం

హైదరాబాద్,సెప్టెంబర్5(జై భీమ్ న్యూస్): మాజీ మంత్రి కొండా సురేఖ బీజేపీలో చేరనున్నారంటూ వస్తున్న వార్తలపై ఆ పార్టీ సీనియర్ నేత మురళీధర్‌రావు స్పందించారు. ఈ ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చుతూ, పార్టీలో చేరికలపై తమకంటూ ఒక స్పష్టమైన విధానం ఉందని తెలిపారు. "ఎవరిని పడితే వారిని పార్టీలో చేర్చుకోబోం" అని ఆయన శనివారం స్పష్టం చేశారు. కొండా సురేఖ చేరిక ప్రచారం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని మురళీధర్‌రావు ఆరోపించారు. "ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సంక్షోభం నెలకొంది. ఆ అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి కథనాలను ప్రచారంలోకి తెస్తున్నారు" అని ఆయన విమర్శించారు.

# చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

## ఉద్యోగుల హక్కుల సాధన సభకు లక్ష మందికి పైగా తరలిరావాలి

## రెండో పీఆర్‌సీ, పెండింగ్ డీఏలు, ఓపీఎస్ అమలుపై ఉద్యోగుల డిమాండ్

**హన్మకొండ, 5 సెప్టెంబర్ 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న నిర్వహించనున్న చలో హైదరాబాద్ ఉద్యోగుల హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమం విజయవంతానికి హనుమకొండ టీఎన్‌జీవోస్ భవన్‌లో హనుమకొండ జిల్లా జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర, ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ నాయకులు హాజరయ్యారు. సమావేశంలో తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావుతో పాటు రాష్ట్ర జేఏసీ నేతలు లింగారెడ్డి, పి. దామోదర్‌రెడ్డి, చావా రవి, సదానందం గౌడ్, తిరుపతి, ఎం.డి. అబ్దుల్లా, వెంకట్‌రెడ్డి, దాస్య నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 10న నిర్వహించనున్న ఉద్యోగుల హక్కుల సాధన సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఇతర వర్గాల ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలిరావాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ కమిటీ, అధికారుల కమిటీ దృష్టికి ఎన్నోసార్లు సమస్యలను తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లలో తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. నెల మొదటి తేదీన జీతాలు చెల్లించడం కూడా ఒక డిమాండ్‌గా మారడం బాధాకరమని అన్నారు. రెండో పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని, విద్యాశాఖలో పెండింగ్ ప్రమోషన్లు, బదిలీలను చేపట్టాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 10లోపు ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తే హక్కుల సాధన సభను ముఖ్యమంత్రి అభినందన సభగా నిర్వహిస్తామని తెలిపారు. సభకు అనుమతి ఇవ్వకపోతే చలో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని మూడేళ్లుగా వేచి చూశామని, ఇన్నేళ్లు గడిచినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతోనే ఉద్యమానికి దిగాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని, ఈహెచ్ఎస్ పథకాన్ని పూర్తిస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా తమకు రావాల్సిన హక్కులనే కోరుతున్నామని స్పష్టం చేశారు. టీఎన్‌జీవోస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుసైని మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. హనుమకొండ జిల్లా జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, వర్కర్లు తదితరులను కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలిస్తామని తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీకి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సెప్టెంబర్ 10న జరిగే సభకు లక్ష మందికి పైగా ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేస్తారని జేఏసీ నాయకులు తెలిపారు. ఉద్యోగులంతా సామూహిక సెలవులు పెట్టి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అన్నమనేని జగన్‌మోహన్‌రావు, గాజే వేణుగోపాల్, బూరుగు రవి, కాజా షరీఫ్, పోలురాజు, శ్రీనివాస్‌తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ నాయకులు ఆకవరపు శ్రీనివాసకుమార్, బైరీ సోమయ్య, డాక్టర్ ప్రవీణ్, గజ్జెల రామ్‌కిషన్, పుల్లూరు వేణుగోపాల్, పనికెల రాజేష్, సదానందం, చైతన్య, జీవన్, దశరథం, పెండెం రాజు, కట్కూరి శ్రీనివాస్, శ్రీహరి, ఉపేందర్‌రెడ్డి, దేవదాస్, సర్వర్ హుస్సేన్, గోపాల్‌రెడ్డి, నాగబ్రహ్మాచారి, శ్యాంసుందర్, రాజీవ్, అనూప్, ప్రణయ్, పృథ్వి, సాంబయ్య, శ్రీలత, రజిత, కల్యాణి, ఇందిర ప్రియదర్శిని, మాధవి, శృతి తదితరులు పాల్గొన్నారు.



